
సమాజహితం

WWW.SAMAJAHITHAM.COM | PRGI : T/TG/2026/0819/5664/1384

సంపుటి: 01 సంచిక: 08 | సమాజహితం - తెలుగు దినపత్రిక | ఎడిటర్: హరీష్ ఆచార్య | శుక్రవారం 13-11-2026 | పేజీలు: 06 | వెల: రూ.2.00





ఇరాన్‌తో యుద్ధాన్ని అమెరికా

మొదలు పెట్టలేదు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్: ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని అమెరికా ప్రారంభించలేదని పేర్కొన్నారు. 1979 నుంచే అమెరికాపై ఇరాన్ పోరాటం చేస్తోందని అన్నారు. ఈ యుద్ధంలో అమెరికా ఇప్పటికే గెలిచిందని, అయితే పాక్షిక విజయం కాకుండా సంపూర్ణ విజయం సాధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అమెరికాధ్వంసం చేసినవాటిని తిరిగి నిర్మించుకోవ డానికి ఇరాన్‌కు 25 ఏళ్లు పడుతుందని వ్యాఖ్యానించారు.



17, 18 తేదీల్లో రాహుల్..

అమెరికా పర్యటన

వివిధ దేశాల్లో విద్యార్థుల ఉద్యమాలపై షికాగో, కొలంబియా యూనివర్సిటీల్లో చర్చలు

దిల్లీ: భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే రాహుల్ గాంధీ విదేశాల్లో పర్యటిస్తారన్న భాజపా విమర్శలను ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ (ఐఓసీ) అధినేత శ్యాం పిట్రోడా తోసిపుచ్చారు. పదేపదే చేసే ఈ తరహా ఆరోపణలను పాతబడిన రాజకీయ బూచిగా, కమలం పార్టీ బోగస్ ప్రచారంగా అభివర్ణించారు. వచ్చే వారం అమెరికాలో రాహుల్ గాంధీ పర్యటన వివరాలను వెల్లడించారు. వివిధ దేశాల్లో విద్యార్థుల ఉద్యమాలు–వాటి డిమాండ్లు, భారత్‌లో వీటిని ఎలా చూస్తున్నారు, ప్రజాస్వామ్యంపై వాటి ప్రభావం గురించి 17న కొలంబియా యూనివర్సిటీలో ముఖాముఖి ఉంటుందని పిట్రోడా తెలిపారు. షికాగో విశ్వవిద్యాలయంలో ప్రముఖ ప్రొఫెసర్ డా.రాబర్ట్ పఏతో ప్రపంచ రాజకీయాలు, పశ్చిమాసియా పరిణామాలు తదితరాలపై ఈ నెల 18న చర్చిస్తారని పేర్కొన్నారు.

పాత కేసులో కోర్టుకు హాజరైన..

సీఎం రేవంత్ రెడ్డి



2వ పేజీలో...

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో తనపై నమోదైన పాత కేసుల విచారణ ప్రక్రియలో భాగంగా ఆయన న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు.

- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- గత ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులో వాంగ్మూలం నమోదు
- 2021 నాగార్జున సాగర్ ఉపఎన్నిక ప్రచారంలో నిబంధనల ఉల్లంఘన అభియోగం
- గతంలో ఏడు కేసుల విచారణ నిమిత్తం కోర్టుకు హాజరైన రేవంత్
- హుజూర్‌నగర్ నాటి కేసును గతంలో కొట్టివేసిన హైకోర్టు



2వ పేజీలో...

నా జీవితం తెరిచిన

పుస్తకం

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్

- సిద్ధరామయ్య సహా ఎవరికీ చెడు తలపెట్టనని స్పష్టీకరణ
- సీఎం కావడం కన్నా 48 ఏళ్ల వయసులో డిగ్రీ పొందడమే ఎక్కువ సంతోషాన్ని ఇచ్చిందని వ్యాఖ్య
- కష్టపడితేనే గుర్తింపు, అదృష్టాన్ని నమ్మొద్దని యువతకు సూచన
- విమర్శలు కాలక్రమేణా కనుమరుగవుతాయి, పనులే మిగులుతాయని వెల్లడి

మైసూరు: తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని, అందులో దాచడానికి రహస్యాలేమీ లేవని కర్ణాటక ఉప డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సహా తాను ఎవరికీ కీడు తలపెట్టబోనని ఆయన పేర్కొన్నారు. మైసూరులో తన జీవిత చరిత్ర 'చలిసువ బండె డీకే శివకుమార్' పుస్తకావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు.

తెలంగాణ రైతులకు తెలుగులోనే..

ఏఐ వ్యవసాయ సలహాలు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, నవంబర్12: రాష్ట్రంలోని రైతులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఇక తెలుగులోనే ఏఐ ఆధారిత వ్యవసాయ సలహాలను వారికి ఇవ్వనుంది. అందుకోసం తెలంగాణలో భారత్ విస్తార్ సేవల అమలుకు వ్యవసాయ శాఖ, ఎన్ఐఎస్‌జీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.
దీంతో రైతు ముంగిటకే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తీసుకెళ్తామని అన్నారు. ఏఐతో ముందుగానే పంట సమస్యల గుర్తింపు..

ఏపీ పెవిలియన్‌ను సందర్శించిన..

కేంద్రమంత్రి పీయూష్ గోయల్





- కేంద్రమంత్రికి రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు వివరించిన సీఎం చంద్రబాబు
- సీఎం, డిప్యూటీ సీఎం పవన్‌తో కలిసి పెవిలియన్‌ను పరిశీలించిన గోయల్
- రాష్ట్ర కళలు, సంస్కృతిని ప్రతిబింబించే స్టాళ్లను ఆసక్తిగా తిలకించిన నేతలు..
- అరకు కాఫీ రుచి చూసిన పీయూష్, చంద్రబాబు, పవన్ కల్యాణ్..

విశాఖపట్టణం,: ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి ప్రణాళికలు, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

2వ పేజీలో...



అడవిలో బుల్లెట్ గాయాలతో

పోలీసుల మృతదేహాలు

ఆయుధాలు మిస్సింగ్..

జమ్మూకశ్మీర్: జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు స్పెషల్ పోలీసు ఆఫీసర్లు అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. కిశ్త్వాడ్ జిల్లాలో నిన్న (నవంబరు 11) విధులు నిర్వర్తిస్తూ అదృశ్యమైన వీరు.. గురువారం ఉదయం అటవీ ప్రాంతంలో విగతజీవులుగా కన్పించారు. వారి శరీరంపై బుల్లెట్ గాయాలున్నట్లు అధికారులు వెల్లడించారు.

2వ పేజీలో...



ఏపీకి మరో భారీ పెట్టుబడి

రూ.29,500 కోట్లతో రెన్యూ సంస్థ

- మంత్రి నారా లోకేశ్‌తో విశాఖలో రెన్యూ సీఈవో సుమంత్ సిన్హా భేటీ
- పంప్డ్ స్టోరేజీ, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులు ఏర్పాటుకు అంగీకారం
- రాష్ట్రంలో ఇప్పటికే పలు ప్రాజెక్టులు నిర్వహిస్తున్న రెన్యూ సంస్థ
- ప్రాజెక్టుల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామని లోకేశ్ హామీ

అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగంలోకి మరో భారీ పెట్టుబడి రానుంది. ప్రముఖ సంస్థ రెన్యూ పవర్ రాష్ట్రంలో కొత్తగా రెండు భారీ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. విశాఖపట్నంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యుత్ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో రెన్యూ చైర్మన్ అండ్ సీఈవో సుమంత్ సిన్హా భేటీ అయ్యారు. చర్చల అనంతరం రూ.29,500 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ఒప్పందం ప్రకారం, రెన్యూ సంస్థ రాష్ట్రంలో 2 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులో రూ.12,500 కోట్లు, గ్రీన్ అమ్మోనియా/ఈ-ఫ్యూయల్ ప్రాజెక్టులో రూ.17,000 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది.



సోనియాగాంధీ ఆత్మకథపై పీవీ కుమార్తె

వాణీదేవి తీవ్ర విమర్శలు

- సోనియాగాంధీ ఆత్మకథపై స్పందించిన పీవీ కుమార్తె ఎమ్మెల్సీ -సురభి వాణీదేవి
- మాజీ ప్రధాని పీవీ అంత్యక్రియలు న్యూఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని ప్రశ్న
- స్వతంత్ర భారత చరిత్రలో ఏ ప్రధానికీ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదన్న వాణీదేవి
- సోనియా జ్ఞాపకాల పుస్తకం అబద్ధాల పుట్ట అన్న పీవీ మనవడు ఎన్వీ సుభాష్



2వ పేజీలో...

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' విడుదలైన నేపథ్యంలో... మాజీ ప్రధాని దివంగత పి.వి. నరసింహారావు కుటుంబ సభ్యుల నుంచి తీవ్ర స్పందన వ్యక్తమైంది.

ఏపీ పెవిలియన్‌ను సందర్శించిన..

కేంద్రమంత్రి పీయూష్ గోయల్





మొదటిపేజీ తరువాయి...

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఈ పెవిలియన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వారికి వివరించారు. ముఖ్యంగా, తిరుపతి, విశాఖపట్టణం, అమరావతి ఎకనమిక్ రీజియన్లలో జరుగుతున్న ప్రగతిపై అధికారులు డిజిటల్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సీఆర్డీఏ పరిధిలో చేపడుతున్న పనులు, విశాఖపట్నం అభివృద్ధి ప్రణాళికలపై ప్రత్యేకంగా వివరించారు. రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సైతం నేతల దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అధికారులు స్పష్టం చేశారు. అనంతరం పెవిలియన్‌లోని సాంస్కృతిక ప్రదర్శనలను నేతలు ఆసక్తిగా తిలకించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏర్పాటు చేసిన కళాకృతుల వద్ద కేంద్రమంత్రి పీయూష్ గోయల్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫొటోలు దిగారు. గిరిజనులు రూపొందించిన చిత్రాలను ప్రత్యేకంగా పరిశీలించి, కేంద్రమంత్రి, సీఎం స్వయంగా నమూనా చిత్రాలను తీర్చిదిద్దడం విశేషం. తోలుబొమ్మలాట, పెన్ కలంకారీ వంటి కళారూపాల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన ప్రముఖ కళాకారులు, వారి నైపుణ్యాల గురించి సీఎం చంద్రబాబు కేంద్రమంత్రికి వివరించారు. పర్యటనలో భాగంగా, అరకు కాఫీ స్టాల్ వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అరకు కాఫీని రుచి చూశారు. కాసేపు సరదాగా ముచ్చటించారు. అనంతరం సదస్సు ప్రాంగణంలో కేంద్రమంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం బ్యాటరీ కారులో కలిసి ప్రయాణించారు. ఈ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారానికి, బలమైన బంధానికి నిదర్శనంగా నిలిచింది.

తెలంగాణ రైతులకు తెలుగులోనే ఏఐ వ్యవసాయ సలహాలు

మొదటిపేజీ తరువాయి...

తద్వారా నష్టాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సాంకేతికతతో వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులకు ఆరు కీలక వ్యవసాయ సేవలు.. ఒకే డిజిటల్ వేదికపైకి వస్తాయని వివరించారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సాగు వ్యయం తగ్గించి.. దిగుబడులు, రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతుల ప్రశ్నలకు ఏఐ వాయిస్ అసిస్టెంట్ 'భారతి' ద్వారా సమాధానాలు ఇస్తుందని తెలిపారు. పంటల సాగు, వాతావరణం, చీడ పీడలు, నేల ఆరోగ్యంపై శాస్త్రీయ సూచనలు కూడా ఇస్తుందని వివరించారు. ఎరువుల వినియోగం, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాల వివరాలు కూడా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. 155261 హెల్ప్ లైన్ ద్వారా వాయిస్ బాట్ సేవలు ఇప్పటికే అందుబాటులో వచ్చాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు. 15 నుంచి 21 రోజుల్లో తెలుగు వెబ్ పోర్టల్, మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. 45 నుంచి 60 రోజుల్లో వాట్సాప్ చాట్ బాట్ సేవలు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు.

సాధారణ ఫోన్ వినియోగించే రైతులకు కూడా వాయిస్ కాల్ ద్వారా సేవలు అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. నాలుగు దశల్లో భారత్ విస్తార్ సేవల విస్తరణకు కార్యాచరణ రూపొందించామని అన్నారు. తెలంగాణ పంటలు, స్థానిక వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సమాచారం అనుసంధానం చేస్తామని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు.

అడవిలో బుల్లెట్ గాయాలతో పోలీసుల మృతదేహాలు

మొదటిపేజీ తరువాయి...

స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌నకు చెందిన బాబీ చాంద్ (57), రశ్‌పాల్ కుమార్ (45).. బుధవారం మధ్యాహ్నం తమ క్యాంప్ నుంచి ధర్నా–మర్వా ప్రాంతంలోని ఆర్మీ పోస్ట్‌కు బయల్దేరారు. మార్గమధ్యంలో మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో వీరికి దచన్ అటవీ ప్రాంతం నుంచి శబ్దాలు వినిపించాయి. దీంతో అటుగా వెళ్లిన వీరిద్దరూ మళ్లీ తిరిగిరాలేదు. అదే సమయంలో మొబైల్ నెట్‌వర్క్ సర్వీసులు కూడా పనిచేయకపోవడం గమనార్హం. వీరు అదృశ్యమైనట్లు నిర్ధరించుకున్న ఆర్మీ బలగాలు అటవీ ప్రాంతంలో ముమ్మర గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలోనే గురువారం ఉదయం వీరి మృతదేహాలను భద్రతా సిబ్బంది గుర్తించారు. ఘటనాస్థలంలో పోలీసు ఆఫీసర్ల సర్వీసు తుపాకులు కన్పించలేదని అధికారులు వెల్లడించారు. దీంతో ఉగ్రకోణం ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఉగ్రవాదులు వీరిని కిడ్నాప్ చేసి హత్య చేసి ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో నిన్న సీఆర్పీఎఫ్ శిబిరంపై ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మోటార్ సైకిళ్లపై వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు చెక్‌పోస్ట్ వద్ద ఉన్న సీఆర్పీఎఫ్ సిబ్బందిపై కాల్పులు జరిపి పరారయ్యారు. దాదాపు అదే సమయంలో కిశ్త్వాడ్‌లో పోలీసులు అదృశ్యమై ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఈ రెండు ఘటనలకు ఏదైనా సంబంధం ఉందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నా జీవితం తెరిచిన పుస్తకం

మొదటిపేజీ తరువాయి...




"నేను సిద్ధరామయ్యతో కలిసి పనిచేశాను. ఆయనకు గానీ, మరెవరికీ గానీ నేను చెడు కోరుకోను. ఇతరులకు హాని తలపెట్టే వ్యక్తిని నేను కాదు, భవిష్యత్తులోనూ అలా చేయను. ఇదే నా నిబద్ధత" అని శివకుమార్ వివరించారు. మానవత్వమే అన్నింటికన్నా ముఖ్యమని, అన్ని కులాలు, మతాల ప్రజలను తాము ప్రేమిస్తామని, గౌరవిస్తామని తెలిపారు. తన ఎదుగుదలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, అయితే విమర్శలకు తాను వెరవబోనని స్పష్టం చేశారు. గతంలో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ఆయనతో పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించినప్పుడు ఆయనను ఇబ్బంది పెట్టకుండా, మద్దతుగా నిలిచేందుకే ప్రయత్నించానని గుర్తుచేశారు. "మనం చేసే పనిని మన మనస్సాక్షి అంగీకరిస్తే చాలు" అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి లేదా కేబినెట్ మంత్రి పదవులు చేపట్టడం కంటే, 48 ఏళ్ల వయసులో మైసూరు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పట్టా అందుకోవడం తన జీవితంలో అత్యంత సంతోషకరమైన క్షణమని శివకుమార్ పేర్కొన్నారు. కష్టకాలంలో జైలులో ఉన్నప్పుడు కూడా తాను ఆత్మవిశ్వాసం కోల్పోలేదని, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువస్తానే నమ్మకంతో పనిచేశానని తెలిపారు. యువత అదృష్టాన్ని నమ్ముకోకుండా కష్టం, క్రమశిక్షణపై ఆధారపడాలని హితవు పలికారు. విమర్శలు కాలక్రమేణా కనుమరుగవుతాయని, కానీ మనం చేసిన పనులే శాశ్వతంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.

సోనియాగాంధీ ఆత్మకథపై పీవీ కుమార్తె వాణీదేవి తీవ్ర విమర్శలు

మొదటిపేజీ తరువాయి...

పీవీపై సోనియాకు గౌరవమే ఉంటే ఆయన అంత్యక్రియలను దేశ రాజధాని ఢిల్లీలో ఎందుకు నిర్వహించలేదని పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సూటిగా ప్రశ్నించారు. "సోనియాగాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' నేను ఇంకా చదవలేదు.కానీ తనకు పీవీతో ఎలాంటి విభేదాలు లేవని, ఆయనంటే ఎంతో గౌరవమని, తన అత్త, మాజీ ప్రధాని ఇందిర, భర్త రాజీవ్‌గాంధీకి అత్యంత ఆప్తుడని సోనియా ఆ పుస్తకంలో నిక్షిప్తం చేసినట్టు మీడియా ద్వారా విన్నాను. కానీ పార్టీకి, గాంధీ కుటుంబానికి సేవచేసిన, దేశ ప్రధానిగా పనిచేసిన పీవీ అంత్యక్రియలను ఢిల్లీలో జరపలేదెందుకు? స్వతంత్ర భారత చరిత్రలో ఏ ప్రధానికీ ఇలా జరగలేదు. దీనిని గౌరవంగా భావించాలా? అవమానమని అనుకోవాలా?" అంటూ ఆమె నిలదీశారు. మరోవైపు పీవీ మనవడు, బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ సైతం సోనియా పుస్తకంపై తీవ్రంగా స్పందించారు. ఈ ఆత్మకథ అసత్యాల పుట్ట అని, చారిత్రక తప్పిదాలతో కూడి ఉందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి పీవీ నరసింహారావు అందించిన సేవలను పుస్తకంలో ఉద్దేశపూర్వకంగానే దాటవేశారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులను మాత్రమే పైకి తెస్తూ, పార్టీలోని ఇతర ముఖ్య నేతలను కించపరచడం గాంధీ కుటుంబానికి అలవాటేనని ఆయన పేర్కొన్నారు. తాజా పరిణామాలతో పీవీ పట్ల కాంగ్రెస్ వైఖరిపై రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చ మొదలైంది.

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు భూముల వేలం.. స్థానికుల అభ్యంతరం



హైదరాబాద్, నవంబర్ 12: పేద ప్రజలకు గృహవసతి కల్పించాలనే ఉద్దేశంతో రైతుల నుంచి సేకరించిన భూముల్లో.. మిగిలిన భూములను తెలంగాణ హౌసింగ్ బోర్డు వేలం వేస్తోంది. కాగా.. ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూమిని ఎలా వేలం వేస్తారంటూ స్థానికులు, బీఆర్ఎస్, బీజేపీ నేతలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో భూముల వేలాన్ని భారీ పోలీస్ బందోబస్తు మధ్య నిర్వహిస్తున్నారు. కాగా.. ఈ వేలంపాట ఈ రోజు (గురువారం) రాత్రి వరకు కొనసాగనున్నట్లు అధికారులు వెల్లడించారు. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డులోని భూములను తెలంగాణ హౌసింగ్ బోర్డు వేలం వేస్తోంది. ఇప్పటికి 12 ఫ్లాట్లు వేలం కాగా.. రాత్రి వరకు వేలంపాట కొనసాగుతుందని అధికారులు తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో 15వ ఫేజ్‌లో 2,696 గజాల భూమి మినహాయించి అన్ని భూములను వేలంపాట ద్వారా విక్రయిస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. కాగా.. హుడా లేఅవుట్ లేకుండానే భూముల విక్రయాలను నిర్వహిస్తున్నారని.. ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను ఎలా వేలం వేస్తారని బీఆర్ఎస్, బీజేపీ నేతలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో వేలంపాటను భారీ బందోబస్తు మధ్య నిర్వహిస్తున్నారు.

పాత కేసులో కోర్టుకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి...

2021లో నాగార్జున సాగర్ శాసనసభ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికల ప్రచార సమయంలో కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలపై రేవంత్ రెడ్డిపై ఒక కేసు నమోదైంది. అప్పట్లో ఆయన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో, 2021 ఏప్రిల్ 11న నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తి గ్రామంలో నిర్వహించిన ఉపఎన్నిక ప్రచారంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆ సందర్భంలో మాస్క్ ధరించలేదని, ఇతర కోవిడ్ నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 313 కింద న్యాయస్థానం సీఎం రేవంత్ రెడ్డి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్), కోవిడ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి రేవంత్ రెడ్డిపై రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇలాంటి కేసులు నమోదయ్యాయి. ఇందులో భాగంగా 2026 ఫిబ్రవరి 28న కూడా గత ప్రభుత్వ కాలంలో నమోదైన ఏడు కేసులకు సంబంధించి ఆయన ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. ఆ కేసులు ప్రధానంగా 2019 హుజూర్‌నగర్ ఉపఎన్నిక, 2021లో కోవిడ్ సమయంలో నిర్వహించిన బహిరంగ సభలకు సంబంధించినవి. 2019 హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా సుమారు 40 వాహనాలు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో ర్యాలీ నిర్వహించారనే అభియోగాలపై రేవంత్ రెడ్డితో పాటు అప్పటి ఎంపీ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిపై కూడా కేసులు నమోదయ్యాయి. అయితే, హుజూర్‌నగర్ ఉపఎన్నికల కోడ్ ఉల్లంఘన ఆరోపణలపై నమోదైన ఒక క్రిమినల్ కేసును గతంలోనే తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఆ కేసులో రేవంత్ రెడ్డిని రెండో నిందితుడిగా (ఆ2), అప్పటి ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డిని మొదటి నిందితుడిగా (ఆ1) పేర్కొన్నారు. ఎన్నికల అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా 2019 అక్టోబర్ 19న పోనుగోడు మండలంలో ప్రచార సభ నిర్వహించారంటూ పోలీసులు ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేసి, హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు, నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినట్లు ఎలాంటి బలమైన ఆధారాలు ఛార్జిషీట్‌లో లేవని, ఈ కేసు చట్టపరంగా నిలబడదని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేసింది. రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. తాజాగా నాగార్జున సాగర్ ఉపఎన్నిక నాటి పాత కేసు విచారణలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి న్యాయస్థానానికి హాజరై తన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

వణుకు పుడుతోంది శివశివా..!



హైదరాబాద్: మహా నగరాన్ని తెల్లవారు జామున చలిగాలులు చుట్టుముట్టాయి. పగలు ఆకాశం నిర్మలంగా ఉండి ఎండ కాస్తుండగా, రాత్రి, తెల్లవారుజామున శీతల గాలులు ప్రభావం చూపుతున్నాయి. శివారు ప్రాంతాల్లో చలి ఎక్కువగా కనిపిస్తోంది. రాజేంద్రనగర్‌లో అత్యల్పంగా 12.0 డిగ్రీలు..అంటే సాధారణం కంటే 4.8 డిగ్రీలు తక్కువగా రికార్డు అయింది. పటాన్ చెరులో 12.6, కుత్బుల్లాపూర్‌లో 14.1, శేరిలింగంపల్లిలో 14.2, కూకట్‌పల్లిలో 14.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదే తరహాలో అమీన్ పూర్‌లో 14.9, బీహెచ్ఈఎల్‌లో 15.1,దుండిగల్‌లో 15.9, హకీంపేటలో 17.0 డిగ్రీలు ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. హైదరాబాద్ మొత్తం మీద సగటున 16.1 డిగ్రీల నమోదైంది.. అంటే శివార్లతో పోలిస్తే నగర కేంద్రంలో ఐదారు డిగ్రీల తేడా కనిపిస్తోంది. ఖైరతాబాద్, అబిడ్స్, కోఠి, అంబర్‌పేట, చార్మినార్ వంటి రద్దీ ప్రాంతాల్లో పగటిపూట వేడి ఎక్కువగానే కనిపించింది. రానున్న రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదు కావచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

ఇరాన్‌తో యుద్ధాన్ని అమెరికా మొదలు పెట్టలేదు

మొదటిపేజీ తరువాయి...

అమెరికాలోని వర్జీనియాలో ఉన్న ఆర్లింగ్టన్ జాతీయ స్మశానవాటికలో బుధవారం నిర్వహించిన 2026 జాతీయ సైనికుల దినోత్సవ కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైనికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇరాన్‌తో యుద్ధంపై తన వైఖరిని వెల్లడించారు. అమెరికా ఇరాన్‌తో యుద్ధాన్ని ప్రారంభించలేదని, 1979 నుంచే అమెరికాపై ఇరాన్ యుద్ధం చేస్తోందని అన్నారు. ఈ సమస్యను చాలా కాలం క్రితమే పరిష్కరించాల్సి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరాన్‌పై గట్టిగా స్పందించామని, అమెరికా సైన్యం తీవ్రంగా పోరాడిందని చెప్పారు. ఈ పోరాటంలో అమెరికా విజయం సాధించిందని పేర్కొన్నారు. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన లక్ష్యాలపై బీ–2 బాంబర్లతో దాడులు నిర్వహించామని, వాటిని ధ్వంసం చేశామని చెప్పారు. ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించకుండా అడ్డుకున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌పై ఇప్పటికే 93 శాతం విజయం సాధించామని, అయితే తమకు 100 శాతం విజయం కావాలని అన్నారు. ఇకపై ఆ దేశంలో మరింత విధ్వంసం సృష్టించాల్సిన అవసరం రాకూడదని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఇరాన్‌తో కొనసాగుతున్న పోరాటంలో అమెరికా కూడా ప్రాణనష్టాన్ని చవిచూసిందని ట్రంప్ అంగీకరించారు. ఈ యుద్ధంలో 18 మంది అమెరికన్లను కోల్పోయామని చెప్పారు.

రైతుల అవస్థలు పట్టించుకోని ప్రభుత్వం..

చిట్యాల : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి ఎదురుచూస్తున్నా కొనుగోళ్లు చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. గురువారం చిట్యాల మండలంలోని ఆరెగూడెం, వెలిమినేడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులకు పైగా గడుస్తున్నా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజులు, వారాల తరబడి పడిగాపులు కాస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ధాన్యం కొనుగోళ్లలో వివిధ కారణాలు చూపుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కొందరు కాంగ్రెస్ నాయకులు రైతులను దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు.

ఏపీకి మరో భారీ పెట్టుబడి

రూ.29,500 కోట్లతో రెన్యూ సంస్థ

మొదటిపేజీ తరువాయి...




ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెన్యూ సంస్థ ఇప్పటికే పలు ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహిస్తుండటంపై అభినందనలు తెలిపారు. మరో రూ.11వేల కోట్ల విలువైన పాలిసిలికాన్, మెటలర్జికల్ గ్రేడ్ సిలికాన్ ప్రాజెక్టు ఏర్పాటుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టులను వేగవంతంచేయాలని, వాటికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని లోకేశ్ హామీ ఇచ్చారు. అలాగే, తిరుపతి ఐఐటీలో ఏర్పాటు చేయబోయే సోలార్ సెల్ ప్రోటోటైపింగ్ కేంద్రంలో భాగస్వామి కావాలని రెన్యూ సంస్థను కోరారు. రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ.. తమ సంస్థ 2015 నుంచే ఏపీలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని తెలిపారు. కళ్యాణదుర్గంలో 24 మెగావాట్ల విండ్ ప్రాజెక్టుతో ప్రారంభించి, ప్రస్తుతం 10 ప్రాంతాల్లో 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను నడుపుతున్నట్లు వివరించారు. గుంతకల్లులో రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక ప్రాజెక్టును నిర్మిస్తున్నామని, రాంబిల్లిలో రూ.4,200 కోట్లతో ఇంగాట్–వేఫర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. తాజాగా కుదిరిన ఒప్పందాలతో ఏపీలో తమ కార్యకలాపాలు మరింత విస్తృతం కానున్నాయని ఆయన పేర్కొన్నారు.

సంపాదకీయం

విశ్వాసం, గౌరవమే వివాహ వ్యవస్థకు మూలం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించి ఉప ముఖ్యమంత్రి అయిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు తన మూడవ భార్యకు విడాకులు ఇచ్చి దూరంగా ఉంటున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పవన్ కళ్యాణ్ విడాకుల గురించే మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియా, టీవీ చానళు , వెబ్ సైట్లు ఒకటేంటి అన్నీ చోట్ల ఏపీ డిప్యూటీ సీఎం ముచ్చటగా మూడో పెళ్లిని కూడా రద్దు చేసుకోవడం ఏంటని ఆశ్చర్యపోతున్నారు. 2026 నవంబర్ 9 రాత్రి పవన్ కళ్యాణ్, అనా లెజ్‌నెవా విడిపోతున్నట్టు ప్రకటించారు. అభిమానులకు ఈ ప్రకటన షాకిచ్చింది. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన ప్రసంగాల్లో సనాతన ధర్మ పరిరక్షణ గురించి ప్రస్తావిస్తుంటారు. అయితే సనాతన ధర్మం గురించి మాట్లాడే వ్యక్తులు తమ వ్యక్తిగత జీవితంలో ధర్మవిలువలు పాటిస్తున్నారా? పవన్ కళ్యాణ్ మమూడు పెళ్లిళ్లు.. మూడో భార్యతో విడాకుల వ్యవహారంతో మరోసారి చర్చనీయాంశమైంది.1997లో నందినిని వివాహం చేసుకున్న పవన్ కళ్యాణ్ 2008లో విడాకులు తీసుకున్నారునటి రేణుదేశాయ్ లో సహజీవనం చేసి 2009లో పెళ్లిచేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలు.. 2012లో విడిపోయారు.రష్యాకు చెందిన అనా లెజ్‌నెవాని 2013లో వివాహం చేసుకున్నారు..వీరికి ఇద్దరు పిల్లలున్నారు..లేటెస్ట్ గా పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్టు ప్రకటించారుతమ వైవాహిక బంధం ముగిసినప్పటికీ పిల్లల బాధ్యతలు కలసి నిర్వహిస్తామని తెలిపారు. సనాతన ధర్మం అంటే శాశ్వతమైన ధర్మం లేదా ఎప్పటికీ నిలిచే జీవన విలువలు అని అర్థం. ఇది కేవలం మతపరమైన నినాదం కాదు.. సత్యం, ధర్మం, అహింస, దయ, కరుణ, ఇంద్రియ నిగ్రహం, పరులకు హాని చేయకపోవడం లాంటి విలువలకు సనాతన ధర్మంలో ప్రాధాన్యత ఉంది. ధర్మం అంటే కేవలం పూజ చేయడం, దేవాలయాలు సందర్శించడం, ఆచారాలు పాటించడం మాత్రమే కాదు.. మనిషి తన బాధ్యతలు నిజాయితీగా నిర్వహించడం, ఇతరుల హక్కులు గౌరవించడం, కుటుంబాన్ని బాధ్యతతో నడిపించడం కూడా ధర్మంలో భాగమే. హిందూ సంప్రదాయంలో వివాహాన్ని పవిత్రమైన సంస్కారంగా భావిస్తారు. ప్రాణి భూమ్మీద పడినప్పటి నుంచి మరణించే వరకూ ముఖ్యమైన 16 సంస్కారాలు అనుసరిస్తారు. వాటిలో వివాహం కూడా ఒకటి. అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకుని ఆఖరిక్షణం వరకూ ఆమెతోనే కలసి బతకాలన్నది శాస్త్రవచనం. పవన్ కళ్యాణ్ మొదటి భార్య నందిని. వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. అయితే, పవన్, నందినిల మధ్య ప్రేమ ఎక్కువ కాలం నిలవలేదు. నందిని కూడా విశాఖపట్నంలోని ఒక సంపన్న కుటుంబానికి చెందినది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లి చేసుకున్నాడని ఆమె ఆరోపించింది. విశాఖపట్నం కుటుంబ న్యాయస్థానానికి వాంగ్మూలం ఇచ్చిన పవన్ కళ్యాణ్, తాను రేణు దేశాయ్‌ను వివాహం చేసుకోలేదని చెప్పారు. ఆ తర్వాత, పవన్ కళ్యాణ్ విడాకుల కోసం దరఖాస్తు చేసుకోగా, 2008లో నందినికి రూ. 5 కోట్ల భరణం చెల్లించి విడాకులు పొందారు.తన మొదటి భార్యతో విడిపోయి, 2012లో, ఈ జంట విడాకులు తీసుకుని విడిపోయారు.అయితే పవన్ కళ్యాణ్ నుండి రేణు దేశాయ్ కోట్ల రూపాయల భరణం అందుకోలేదని సమాచారం. దానికి బదులుగా, పవన్ కళ్యాణ్ ప్రతి నెలా వారి ఇద్దరు పిల్లల పోషణ ఖర్చులను చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. రేణు దేశాయ్ తన పేరు మీద కొన్ని ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్నట్లు కూడా సినీ వర్గాల్లో ఇన్ సైడ్ టాక్.తన రెండవ భార్య రేణు దేశాయ్‌తో విడాకులు తీసుకునే ముందు, పవన్ కళ్యాణ్ 2010లో 'టీన్ మార్' సినిమా షూటింగ్ కోసం రష్యా వెళ్లారు. అక్కడ ఆయన మోడల్ అన్నా లెజ్నోవాను కలిశారు. 2012లో రేణు దేశాయ్‌కు విడాకులు ఇచ్చిన పవన్ కళ్యాణ్, 2013 ప్రత్యేక వివాహ చట్టం కింద అన్నా లేజనోవాను వివాహం చేసుకున్నారు. ఇప్పుడు ఆయన మూడవ వివాహం కూడా విడాకుల బాట పట్టింది. అన్నాతో పవన్ కళ్యాణ్ 13 ఏళ్ల వైవాహిక జీవితానికి తెరదించారు.కొందరు మాత్రం పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడానికి ఓ బలైమన కారణం ఉందంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. అందులో మరీ ముఖ్యంగా తన రాజకీయపాలన కోసమే ఈ పని చేసినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు సేవ చేయాలన్న ఒకే ఒక్క కారణంతో తన కుటుంబానికి దూరంగా ఉండాలనుకున్నాడని.. అందుకోసమే విడాకులు తీసుకున్నాడని పెద్ద ఎత్తున పోస్ట్‌లు పెడుతున్నారు. నిజంగానే ఈ కారణంతోనే విడాకులు తీసుకున్నాడా? లేదంటే ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయా? అనేది క్లారిటీ లేదు.ఇందులో నిజమెంతుందో పక్కన పెడితే ఈ టైమ్‌లో పవన్ కళ్యాణ్ విడాకులు తీసుకోవడం తన పొలిటికల్ కెరీర్‌కు మరో మచ్చలా మిగిలిపోతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే చాలా మంది మాత్రం అది వాళ్ల పర్సనల్ లైఫ్.. విడాకులు తీసుకుంటారో, కలిసుంటారో అన్నది వాళ్ల ఛాయిస్. వాళ్ల డెసిషన్‌కు రెస్పెక్ట్ ఇవ్వాలి కానీ... ఇంకా బురద జల్లే ప్రయత్నాలు చేయడం సరికాదు అంటూ పోస్ట్‌లు పెడుతున్నారు.భార్యాభర్తలు పరస్పర విశ్వాసం, గౌరవం, బాధ్యతతో జీవించాలని వివిధ ధర్మశాస్త్రాలు, సంప్రదాయాలు బోధిస్తాయి. వివాహం విఫలం అయితే జీవితాంతం బాధను భరించాలనే నియమమం సనాతన ధర్మంలో ఉందని చెప్పలేం. పెళ్లి, విడాకులు, పునర్వివాహాల విషయంలో హిందూ సంప్రదాయాల్లో భిన్నమైన అభిప్రాయాలు, ఆచారాలు ఉన్నాయి. ఆధునిక భారతీయ చట్టం కూడా విడాకులు, పునర్వివాహాలకు అవకాశం కల్పిస్తోంది. ఓ వ్యక్తి ఎన్ని వివాహాలు చేసుకున్నారనే సంఖ్య ఆధారంగా మాత్రమే వారి ధార్మికతను నిర్ణయించడం సరైన పద్ధతి కాదు. అదే సమయంలో ప్రతి వివాహంలోనూ భాగస్వామ్య గౌరవం, పిల్లల సంక్షేమం, కుటుంబ బాధ్యతలను ప్రాధాన్యత ఇవ్వడం అవసరం.ఆధ్యాత్మిక దృక్పథంలో చూస్తే వ్యక్తిగత జీవితంపై తీర్పు చెప్పడం కన్నా ఆ వ్యక్తి ప్రవర్తనలో ధర్మ విలువలు ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయో పరిశీలించడం ముఖ్యం. వివాహ బంధం కొనసాగపోవడానికి ఎన్నో వ్యక్తిగత కారణాలు ఉండొచ్చు. పూర్తి కారణాలు తెలియకుండా తప్పొప్పులు చెప్పడం సముచితం కాదంటారు ఆధ్యాత్మికవేత్తలు. సనాతన ధర్మం గురించి ప్రజలకు సందేశాలు ఇచ్చేనాయకులు తమ జీవితాల్లో సత్యం, నిబద్ధత, బాధ్యత, పరస్పర గౌరవం వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అంతా ఆశించడం సహజం. సనాతన ధర్మం అంటే ఇతరులకు చెప్పేందుకు ఉపయోగించే నినాదం కాదు..అది మనిషి తన జీవితంలో ఆచరించాల్సిన విలువల సమాహారం. రాజకీయ నాయకుడు అయినా, ఆధ్యాత్మికవేత్త అయినా, సామాన్యుడు అయినా ధర్మం ముందు బాధ్యత ఒక్కటే. ధర్మం మాటల్లో కనిపించడం కన్నా చేతల్లో చూపించినప్పుడే సందేశం విలువ పెరుగుతుంది..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావం



మహబూబ్ నగర్, : తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి అగ్నిపరీక్షగా మారే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చూపుతున్న అలసత్వం.. ముఖ్యంగా రెండో వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) అమలుపై నెలకొన్న ప్రతిష్టంభన ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. తమ చిరకాల డిమాండ్లను నెరవేర్చకపోతే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేయడమే కాకుండా, స్వయంగా ప్రచారం చేసి గుణపాఠం చెబుతామని ఉద్యోగ సంఘాలు హెచ్చరిస్తుండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోందిప్రస్తుతం మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్, అలాగే వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని ఆరు జిల్లాల్లో కలిపి సుమారు నాలుగు లక్షల మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. పట్టభద్రుల స్థానాల్లో ఫలితాలను తారుమారు చేయగల సంఖ్యాబలం వీరికి ఉండటంతో, ఉద్యోగ వర్గాల అసహనం నేరుగా ఫలితాలపై ప్రభావం చూపే ప్రమాదం ఏర్పడింది.నవంబర్ 6న నాంపల్లిలోని టీజీవో భవన్‌లో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్‌పర్సన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. మూడేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా జూలై 1, 2023 నుంచి వర్తించేలా 51శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీ నివేదికను తక్షణమే విడుదల చేసి అమలు చేయాలని జేఏసీ పట్టుబడుతోంది. గతంలో జూన్ 2 నాటికి కమిషన్ నుంచి నివేదిక తెప్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేర లేదని నేతలు గుర్తుచేశారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన వివిధ బిల్లుల బకాయిలు ప్రస్తుతం రూ. 10,000 కోట్ల మార్కును దాటాయి. వీటిని క్లియర్ చేయడానికి ప్రభుత్వం ప్రతినెలా కేటాయిస్తున్న మొత్తాన్ని ప్రస్తుత రూ. 1,000 కోట్ల నుంచి రూ. 2,000 కోట్లకు పెంచాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.మరోవైపు.. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ అంశాన్ని పరిశీలించేందుకు సంయుక్త కమిటీ వేస్తామని, పీఆర్సీ నివేదిక తెప్పిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చి రెండు నెలలు దాటినా ఇప్పటివరకు కార్యాచరణ శూన్యమని మండిపడ్డారు. ప్రభుత్వం తెచ్చిన కొత్త ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను జేఏసీ స్వాగతించినప్పటికీ, అది కాగితాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికీ వర్తింపజేయాలని, నెట్‌వర్క్ ఆసుపత్రులు తప్పనిసరిగా నగదు రహిత సేవలు అందించేలా కఠిన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు.జేఏసీ అగ్రనాయకత్వం ప్రభుత్వంతో సంప్రదింపులకు ఇంకా మొగ్గు చూపుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉద్యోగుల్లో తీవ్ర అసహనం నెలకొంది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను దాటవేస్తున్నారన్న ఆగ్రహం వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే దీపావళి పండుగ ముగియగానే ఉద్యమ కార్యాచరణను ఖరారు చేయాలని జేఏసీ నిర్ణయించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తున్న వేళ, ప్రభుత్వం నుంచి స్పష్టమైన కాలపరిమితితో కూడిన హామీ రాకపోతే పోరుబాట తప్పదని ఉద్యోగ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. పెండింగ్ బిల్లుల విడుదల, 51శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు దిశగా ప్రభుత్వం త్వరితగతిన అడుగులు వేయకపోతే, గ్రాడ్యుయేట్ ఓటర్ల ఆగ్రహం అధికార పార్టీకి రాజకీయంగా భారీ నష్టాన్ని చేకూర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి

సస్పెన్షన్ లో రిటైర్మెంట్..!

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి, అడిషనల్ డీజీపీ ఎన్. సంజయ్‌కు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. నిధుల దుర్వినియోగం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన సస్పెన్షన్‌ను మరోసారి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన వయోపరిమితి ప్రకారం పదవీ విరమణ పొందే 2027 మార్చి 31వ తేదీ వరకు లేదా ఆయనపై ఉన్న క్రిమినల్ విచారణ పూర్తయ్యే వరకు ఏది ముందైతే అది సస్పెన్షన్ వేటు కొనసాగుతుందని స్పష్టం చేసింది.

ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ అధికారిక జీవో జారీ చేశారు.గత ప్రభుత్వ హయాంలో ఏపీ సీఐడీ అడిషనల్ డీజీపీగా, అలాగే విపత్తు నిర్వహణ-అగ్నిమాపక సేవల శాఖ డీజీగా పనిచేసిన సమయంలో సంజయ్ భారీగా నిధుల మళ్లింపునకు పాల్పడ్డారని అభియోగాలు నమోదు అయ్యాయి.

అగ్ని వెబ్ పోర్టల్ నిర్వహణకు కేటాయించిన ప్రభుత్వ నిధులను పక్కదోవ పట్టించడంతో పాటు, సీఐడీ చీఫ్‌గా ఎస్సీ, ఎస్టీ చట్టంపై పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు కేటాయించిన నిధుల్లో రూ. 1.15 కోట్లు దుర్వినియోగం చేశారనే ప్రాథమిక ఆధారాలు లభించాయి.

దీంతో ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్-1969 కింద ప్రభుత్వం ఆయనపై 2024 డిసెంబర్ 3న తొలిసారి సస్పెన్షన్ విధించింది. విజయవాడ ఏసీబీ 2024 డిసెంబర్ 24న సంజయ్‌పై అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణను వేగవంతం చేసింది. దీనికితోడు సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్ విశ్వజిత్ నేతృత్వంలో ఆయనపై రెగ్యులర్ శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతోంది. కీలక సాక్షుల విచారణ కొనసాగుతుండటం, ఫొరెన్సిక్ ల్యాబ్ నివేదికలు ఇంకా రావాల్సి ఉండటంతో సమీక్షా కమిటీ సమావేశమై సస్పెన్షన్‌ను కొనసాగించాలని సిఫార్సు చేసింది.హోదా రీత్యా సీనియర్ ఐపీఎస్ అధికారి కావడంతో, ఒకవేళ సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకుంటే సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, ఆధారాలను తారుమారు చేసే అవకాశం ఉందన్న ఏసీబీ డీజీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో విచారణలన్నీ పూర్తికాకుండా సర్వీసులోకి వచ్చే అవకాశం లేకపోవడంతో ఆయన రిటైర్మెంట్ కూడా సస్పెన్షన్ కాలంలోనే ముగియనుంది. ఈ వ్యవహారంలో తదుపరి చట్టపరమైన చర్యలు వేగంగా చేపట్టాలని ప్రభుత్వం డీజీపీని ఆదేశించింది.

భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు తప్పనిసరి

ఎంపీడీవో పుల్లారావు



నార్నూర్, నవంబర్ 12 : వర్ష భావ పరిస్థితులను అధిగమించడానికి భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించాలని ఎంపీడీవో పుల్లారావు సూచించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో అధ్యక్షతన మండల ఇస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు మండల ప్రగతిని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో నీటి జలాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయని, నీటిని వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వృథా నీటిని అరికట్టేందుకు ఇంకుడు గుంతలు నిర్మించుకొవాలన్నారు. ప్రతి సమస్యను సమన్వయంతో పరిష్కరించి ప్రజలు ఇబ్బంది పడకుండా కృషి చేద్దామన్నారు. ఈసమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈశ్రీనివాస్, ఎంపీఓ మహేష్, ఏవో ఆకాష్, ఆయా శాఖ అధికారులు, సర్పంచులు ఉన్నారు.

ఆరుట్ల పబ్లిక్ స్కూల్‌లో నెల రోజులుగా నిలిచిన అల్పాహార పథకం..

మంచాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అల్పాహార పథకం నిధుల కొరతతో నీరుగారుతోంది. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో గత నెల రోజులుగా అల్పాహార పథకం నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లుల జాప్యంతో నిలిచిన సరఫరా..: పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడం, పెండింగ్ బిల్లులు పేరుకుపోవడంతో నిర్వాహకులు టిఫిన్ సరఫరాను నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఆర్థిక భారం మోయలేక నిర్వాహకులు చేతులెత్తేయడంతో, స్వయంగా ముఖ్యమంత్రి ప్రారంభించిన ప్రతిష్టాత్మక పాఠశాలలోనే అల్పాహార పథకానికి గ్రహణం పట్టింది. నెల రోజులుగా పథకం ఆగిపోయినా ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉదయం టిఫిన్ లేక విద్యార్థుల అవస్థలు..: నిరుపేద కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులు ఉదయాన్నే ఇళ్ల వద్ద ఏమీ తినకుండానే పాఠశాలకు వస్తుంటారు. బడికి వెళితే వేడివేడి అల్పాహారం అందుతుందన్న భరోసాతో వచ్చే చిన్నారులకు గత నెల రోజులుగా నిరాశే ఎదురవుతోంది. ప్రస్తుతం పాఠశాలలో కేవలం మధ్యాహ్న భోజనం మాత్రమే అందుతుండటంతో, విద్యార్థులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆకలితోనే తరగతులు వినాల్సిన దుస్థితి నెలకొంది. ఆకలితో పాఠాల పై దృష్టి పెట్టలేకపోతున్నామని, నీరసించి పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధుల కొరత సాకుతో పేద పిల్లల కడుపు కొట్టడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.టిఫిన్ నిలిపివేయడం వల్ల పిల్లలు పస్తులుండాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయాలని, ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో అల్పాహార పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

డ్రైనేజీ సమస్యకు చెక్ పెట్టేలా చర్యలు..

అధికారులకు ఎమ్మెల్యే తలసాని కీలక ఆదేశాలు!




బేగంపేట: సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బస్తీల్లో డ్రైనేజీ సమస్యలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. మోండా డివిజన్ పరిధిలోని బారా గల్లీలో డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల బస్తీ వాసులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి బారా గల్లీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. బస్తీని ఆనుకుని ఉన్న ఇస్లామియా స్కూల్ ఆవరణలోని గోడ కూలి డ్రైనేజీ పైప్‌లైన్ చాంబర్‌పై పడటంతో మురుగునీటి ప్రవాహం నిలిచిపోయిందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బారా గల్లీలో నివసించే వారంతా పేదలేనని, వారికి ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించే బాధ్యత తనపై ఉందని అన్నారు. వెంటనే డ్రైనేజీ చాంబర్ మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా బారా గల్లీ మొత్తం నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటు పూర్తయిన అనంతరం బస్తీలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో బోయిన్‌పల్లి సర్కిల్ డీసీ డాకు నాయక్, ఏఈ వర్దేవ్, వాటర్ వర్క్స్ మేనేజర్ మనోహర్, శానిటేషన్ అధికారి షఫీ, స్ట్రీట్ లైట్స్ ఏఈ, హార్టికల్చర్ అధికారి డేవిడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు గందే నాగులు, తలసాని స్రైలాబ్ యాదవ్, రాములు, కొండాపురం మహేష్ యాదవ్, జయరాజ్, సత్యనారాయణ, ప్రమోద్, మహేందర్, బస్తీ వాసులు మహ్మద్ హమీద్, రాము తదితరులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం:మంత్రి పొంగులేటి

బడంగ్‌పేట్: దశాబ్దాలుగా అద్దె ఇళ్లలో నివసిస్తూ సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేదల కల నెరవేరే దిశగా అడుగు పడింది. మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి డివిజన్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజా పాలనలో అర్హులైన పేదలందరికీ న్యాయం చేస్తామని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. వచ్చే ఏడాది దీపావళి నాటికి అర్హులైన పేదలు తమ సొంతింట్లో దీపాలు వెలిగించుకునేలా చర్యలు తీసుకుంటామని లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న తమ కల నెరవేరబోతోందన్న ఆశతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. నాయకుల హామీతో పలువురు భావోద్వేగానికి గురై ఆనందభాష్పాలు రాల్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి, అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ సిద్ధం



హైదరాబాద్, : హైదరాబాద్ శివార్లలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'ఫ్యూచర్ సిటీ' మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. సింగపూర్‌కు చెందిన ప్రఖ్యాత సంస్థ 'డీపీ ఆర్కిటెక్ట్స్' అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ప్రణాళికను రూపొందించింది. మొత్తం 1.80 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ నగరం మాస్టర్ ప్లాన్‌ను త్వరలో జరిగే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.పురపాలక శాఖ అధికారుల సమాచారం ప్రకారం, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) పరిధిలోని 7 మండలాలు, 71 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రణాళికను రూపొందించారు. నగరాల అస్తవ్యస్త విస్తరణకు అడ్డుకట్ట వేస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటం దీని ముఖ్య ఉద్దేశం. భూ వినియోగ ప్రణాళిక కింద వ్యవసాయ, నివాస, పారిశ్రామిక, వాణిజ్య, పర్యావరణ పరిరక్షణ ప్రాంతాలను స్పష్టంగా విభజించారు. పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తూనే ఉద్యోగుల నివాసాలు, విద్య, వైద్యం వంటి సామాజిక వసతులపై దృష్టి సారించారు. 2047 నాటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ ప్లాన్‌లో రవాణా సౌకర్యాలకు పెద్దపీట వేశారు.

ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారులను అనుసంధానించనున్నారు. పర్యావరణ అనుమతులపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు కావడంతో, చెరువులు, నాలాలు, అటవీ ప్రాంతాల పరిరక్షణకు ఈ ప్రణాళికలో స్పష్టమైన మార్గదర్శకాలు చేర్చారు.ఈ మాస్టర్ ప్లాన్‌లో వివిధ రంగాలకు ప్రత్యేక జోన్లను కేటాయించారు. ఇందులో లైఫ్ సైన్సెస్ హబ్‌కు 4,000 ఎకరాలు, నివాస ప్రాంతాలకు 2,477 ఎకరాలు, ఎలక్ట్రిక్ వాహనాలు –ఎనర్జీ పార్కులకు 1,976 ఎకరాలు కేటాయించారు. అలాగే హెల్త్ సిటీకి 594 ఎకరాలు, ఏఐ సిటీకి 403 ఎకరాలు, డేటా సెంటర్ హబ్‌కు 313 ఎకరాలు, ఎడ్యుకేషన్ హబ్‌కు 255 ఎకరాలు కేటాయించారు.మరోవైపు, మాస్టర్ ప్లాన్ సిద్ధమైన నేపథ్యంలో తమ భూములు ఏ జోన్ పరిధిలోకి వస్తాయోనన్న ఆందోళన రైతులు, భూ యజమానులు, రియల్ ఎస్టేట్ వర్గాల్లో నెలకొంది. రైతుల హక్కులు, భూసేకరణ, పరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్‌కు దక్షిణంగా రంగారెడ్డి జిల్లాలో ఓఆర్ఆర్, శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేల మధ్య విస్తరించి ఉన్న ఈ నగరాన్ని 'నెట్-జీరో స్మార్ట్ సిటీ'గా అభివృద్ధి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.

కార్యక్రమాలకు చిన్నారెడ్డి దూరం..!



వరంగల్, : తెలంగాణ కాంగ్రెస్‌లో మరో సీనియర్ నేత వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు డాక్టర్ జీ. చిన్నారెడ్డి ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలక పదవులు నిర్వహించిన ఆయన.. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల తర్వాత మౌనం పాటిస్తుండటంతో అసలు ఏం జరుగుతోందనే చర్చ మొదలైంది. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి తరహాలో చిన్నారెడ్డి కూడా పార్టీకి దూరమయ్యే ఆలోచనలో ఉన్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.డాక్టర్ జీ. చిన్నారెడ్డికి కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉంది. 1985 నుంచి ఎన్నికల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయనకు పార్టీ పలుమార్లు అవకాశాలు కల్పించింది. మొత్తం ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం ఇచ్చింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగానూ పనిచేశారు.పార్టీ అధిష్ఠానానికి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన చిన్నారెడ్డి.. ఇటీవల వనపర్తి రాజకీయ పరిణామాల నేపథ్యంలో వార్తల్లో నిలిచారు. ప్రస్తుత ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పార్టీ వ్యవహారాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందు వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అనంతరం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి ప్రభుత్వం తొలగించింది. దీంతో చిన్నారెడ్డి రాజకీయ ప్రస్థానంలో కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి.ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించిన తర్వాత చిన్నారెడ్డి రాజకీయంగా మౌనం పాటిస్తున్నారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. హైదరాబాద్‌లోనూ, ఢిల్లీలోనూ పార్టీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో ఆయన కనిపించడం లేదని నేతలు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పార్టీతో విభేదాల నేపథ్యంలో తీసుకున్న రాజకీయ నిర్ణయాలు కూడా చర్చకు వస్తున్నాయి. చిన్నారెడ్డి కూడా అదే దారిలో పయనిస్తారా? పార్టీపై అసంతృప్తితోనే మౌనం వహిస్తున్నారా? లేక ప్రస్తుత పరిణామాలు సద్దుమణిగే వరకు వేచి చూస్తున్నారా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చిన్నారెడ్డి భవిష్యత్ కార్యాచరణపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. పార్టీ నాయకత్వంతో మళ్లీ సఖ్యత కుదుర్చుకుంటారా? తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారా? లేక తన రాజకీయ భవిష్యత్తుపై మరో నిర్ణయం తీసుకుంటారా? అన్నది చూడాలి. ప్రస్తుతానికి ఆయన మౌనం వెనుక ఉన్న కారణాలపై స్పష్టత లేదు. రానున్న రోజుల్లో చిన్నారెడ్డి వేసే రాజకీయ అడుగులే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పనున్నాయి.

నామినేటెడ్ పితలాటకం

హైదరాబాద్, : తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టి డిసెంబర్ 7 నాటికి మూడేళ్లు పూర్తి చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కార్పొరేషన్లు, కమిషన్లు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల భర్తీ ఒక కత్తిమీద సాములా మారింది. అధికారం చేపట్టిన కొత్తలో పదవులు ఆశించి నిరాశ చెందిన ద్వితీయ శ్రేణి నాయకత్వం, పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన కేడర్ నుంచి ఒత్తిడి తీవ్రమవుతున్న వేళ.. నిర్ణయాలు మాత్రం నిరవధికంగా వాయిదా పడుతున్నాయి. ఒకవైపు పార్టీ సంస్థాగత బలోపేతం, మరోవైపు భవిష్యత్ ఎన్నికల ముఖచిత్రం.. ఈ రెండింటి సమతూకం కుదరకపోవడమే ఈ రాజకీయ ప్రతిష్టంభనకు ప్రధాన కారణం.రాష్ట్రంలోని మెజారిటీ కార్పొరేషన్లు, కమిషన్లు ప్రస్తుతం నడిపించే నాయకుడు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 2024లో నియమితులైన పలువురు ఛైర్మన్లు, పాలకమండలి సభ్యుల పదవీకాలం జూలై, ఆగస్టు నెలల్లోనే ముగిసింది. మిగిలిన విభాగాల్లోనూ పూర్తిస్థాయి నియామకాలు చేపట్టలేదు. నెలాఖరుకల్లా కొలిక్కి వస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పలుమార్లు సంకేతాలిచ్చినప్పటికీ, గ్రౌండ్ లెవల్‌లో ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఇప్పటికే రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ మధ్య జరిగిన చర్చల్లో దాదాపు 15 కార్పొరేషన్లు, కమిషన్ల ఛైర్మన్లు, సభ్యుల ఎంపికపై ప్రాథమిక అవగాహన కుదిరినప్పటికీ, మిగిలిన కీలక విభాగాల విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. దీనికితోడు లండన్ వర్సిటీలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షీ నటరాజన్ అందుబాటులో లేకపోవడం కూడా ప్రక్రియలో జాప్యానికి కారణంగా కనిపిస్తోంది.తాజా సమాచారం ప్రకారం ఈ నెల 12న లేదా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి రోజైన నవంబరు 19న తొలి విడత నామినేటెడ్ పదవుల జాబితా వెలువడవచ్చనే ప్రచారం బలంగా సాగుతోంది. అయితే నవంబరు 12, 13, 14 తేదీల్లో హెచ్ఐసీసీలో జరిగే ప్రతిష్టాత్మక 'భారత్ సమ్మిట్'కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ హాజరయ్యే అవకాశాలు ఉన్నందున, వారి రాకను బట్టి తుది భేటీ ఉండనుంది. ఒకవేళ ఇక్కడ కూడా పీటముడి వీడకపోతే స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఈ వ్యవహారం వాయిదా పడే ప్రమాదముంది. ఈ దఫా రెన్యూవల్ కేవలం నిర్మలా జగ్గారెడ్డి, ప్రీతమ్, బెల్లయ్యనాయక్, శివసేనారెడ్డి సహా ఆరుగురికి మించి ఉండకపోవచ్చని సమాచారం. మెజారిటీ స్థానాలను కొత్త ముఖాలకే కేటాయించి అనంతృప్తిని చల్లార్చాలని అధిష్ఠానం భావిస్తోంది.మరోవైపు గవర్నర్ కోటా కింద భర్తీ చేయాల్సిన మూడు ఎమ్మెల్సీ స్థానాల ప్రక్రియను డిసెంబర్ రెండో లేదా మూడో వారం వరకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పక్కనబెట్టింది. ముందుగా కార్పొరేషన్లను తేల్చి, ఆ తర్వాతే మండలి లెక్కలు తేల్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ నిర్ణయించారు. 2027 మార్చిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీకరణాలు ఈ వాయిదా వెనుక దాగి ఉన్నాయి.

ముఖ్యంగా మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం సీఎం సొంత జిల్లాను కలుపుకుని ఉండటంతో అక్కడ పాగా వేయడం ప్రతిష్టాత్మకంగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకుని గవర్నర్ కోటా ఎమ్మెల్సీల్లో ఇద్దరు బీసీలకు, ఒక బ్రాహ్మణ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలనే ఫార్ములా తెరపైకి వచ్చింది. బీసీల కోటాలో పద్మశాలీతో పాటు మున్నూరు కాపు లేదా ముదిరాజ్ వర్గానికి చోటు కల్పించాలని యోచిస్తుండగా, బీఆర్ఎస్, బీజేపీలు బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఇచ్చిన ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ కూడా ఆ వర్గాన్ని ప్రసన్నం చేసుకునే ఎత్తుగడ వేస్తోంది. మిగిలిన రెండేళ్ల పదవీకాలాన్ని సద్వినియోగం చేసుకుని, రాబోయే సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడాలని చూస్తున్న ఆశావహుల లాబీయింగ్ తారస్థాయికి చేరింది. అసంతృప్తి పెచ్చరిల్లకుండా, అన్ని వర్గాలనూ ఏకతాటిపై నిలవడం నాయకత్వానికి పెను పరీక్షగా మారింది

స్కైవాక్ లో మారుతున్న సికింద్రాబాద్



హైదరాబాద్, : సికింద్రాబాద్‌లో బస్ టెర్మినల్, రైల్వే స్టేషన్, మెట్రో స్టేషన్లను అనుసంధానిస్తూ స్కైవాక్‌లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. చిలకలగూడలో ఐదు ఎకరాల్లో కొత్త బస్ టెర్మినల్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి రైల్వే స్టేషన్ పదో ప్లాట్‌ఫామ్ వరకు స్కైవాక్ నిర్మించనున్నారు. ఈస్ట్, వెస్ట్ మెట్రో స్టేషన్లకు కూడా అనుసంధాన మార్గాలను ప్రతిపాదించారు. కొత్త టెర్మినల్ వెయ్యికి పైగా సిటీ బస్సులకు సేవలందించనుండగా.. అక్కడే ఈవీ స్టేషన్లు కూడా ఏర్పాటు చేయనున్నారు.చిలకలగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో రైల్వేకు చెందిన ఐదు ఎకరాల భూమిలో కొత్త బస్ టెర్మినల్‌ను నిర్మించాలని టీజీఎస్ఆర్టీసీ ప్రతిపాదించింది. ఈ టెర్మినల్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని పదో ప్లాట్‌ఫామ్ వరకు స్కైవాక్ నిర్మించనున్నారు. దీనివల్ల బస్ టెర్మినల్ నుంచి రైల్వే స్టేషన్‌తోపాటు సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌కు కూడా ప్రయాణికులు సులభంగా చేరుకోవచ్చు. ప్రస్తుతం రద్దీగా ఉండే రోడ్లపై నడుచుకుంటూ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ స్కైవాక్‌లు ఉపయోగపడనున్నాయి.కొత్త బస్ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి ఆర్టీసీ, దక్షిణ మధ్య రైల్వే మధ్య భూ మార్పిడి ఒప్పందం త్వరలో కుదరనుంది. ఇందులో భాగంగా చిలకలగూడ రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో రైల్వేకు చెందిన ఐదు ఎకరాల భూమిని ఆర్టీసీకి కేటాయించనున్నారు. ప్రతిగా కాచిగూడ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి కోసం ఆర్టీసీకి చెందిన ఐదు ఎకరాల భూమిని రైల్వేకు ఇవ్వనున్నారు. కాచిగూడలో రైల్వే నిధులతో ఆర్టీసీ బస్ డిపోను నిర్మించనుంది. ఇందుకు సంబంధించిన ఒప్పందంపై త్వరలో సంతకాలు చేయనున్నట్లు ఆర్టీసీ ఉన్నతాధికారి వెల్లడించారు.కొత్తగా నిర్మించనున్న సికింద్రాబాద్ బస్ టెర్మినల్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే వెయ్యికి పైగా సిటీ బస్సులను నిర్వహించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేకంగా ఛార్జింగ్ సదుపాయాలు కూడా కల్పించనున్నారు. ప్రస్తుతం గురుద్వారా, బ్లూ సీ హోటల్, రెతిఫైల్, చిలకలగూడ జంక్షన్ ప్రాంతాల్లో బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. కొత్త టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతాల్లో బస్సుల నిలుపుదల అవసరం ఉండదని అధికారులు భావిస్తున్నారు.సికింద్రాబాద్ ప్రాంతంలో పాదచారుల రాకపోకలు సులభతరం చేసేందుకు హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ గతంలోనే స్కైవాక్‌ల ప్రతిపాదనలు రూపొందించింది. సికింద్రాబాద్ ఈస్ట్, వెస్ట్ మెట్రో స్టేషన్లను రైల్వే స్టేషన్‌తో అనుసంధానించేలా మరో రెండు మార్గాలను ప్రతిపాదించారు. వీటితో మెట్రో ప్రయాణికులు, రైల్వే ప్రయాణికులు, స్థానిక పాదచారులకు ప్రయోజనం కలగనుంది. చిలకలగూడ వైపు ప్రతిపాదించిన స్కైవాక్ ఆ ప్రాంతంలో పాదచారుల రాకపోకల సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.మరోవైపు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. పదో ప్లాట్‌ఫామ్ వైపు చేపట్టిన పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది నాటికి స్టేషన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. పునరాభివృద్ధి పనులు పూర్తవడంతోపాటు ప్రతిపాదిత స్కైవాక్‌లు అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్ రవాణా కేంద్రంలో ప్రయాణికుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

కాంగ్రెస్‌కు పరీక్షగా ఉద్యోగుల అసంతృప్తి!



హైదరాబాద్,: తెలంగాణలో రెండో వేతన సవరణ సంఘంనివేదిక అమలు ఆలస్యం అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా మరో సవాల్‌గా మారుతోంది. ఇప్పటికే పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు.. ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పడే అవకాశాలున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. తెలంగాణలో రెండో పీఆర్సీ ప్రక్రియ ప్రారంభమై మూడేళ్లు దాటుతున్నా.. ఇప్పటివరకు నివేదికపై స్పష్టత రాకపోవడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమవుతోంది. 2023 అక్టోబర్‌లో రెండో పీఆర్సీని ఏర్పాటు చేయగా.. ఆరు నెలల్లో సిఫార్సులు అందించాల్సి ఉంది. అయితే గడువు దాటినా నివేదిక పెండింగ్‌లోనే ఉండటంతో ఉద్యోగ సంఘాలు పలుమార్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి.ఈ ఏడాది మే 2న ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. పీఆర్సీ నివేదికను త్వరగా అందించాలని అధికారుల కమిటీని ఆదేశించినట్లు ప్రకటించారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 18లోగా నివేదిక సమర్పించాలని ప్రభుత్వం గడువు విధించగా.. నవంబర్ నాటికీ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ పరిష్కారం కాలేదనే అసంతృప్తి కొనసాగుతోంది.పీఆర్సీ నివేదికను వెంటనే విడుదల చేసి అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (డిమాండ్ చేస్తోంది. 51 శాతం ఫిట్‌మెంట్‌తో 2023 జులై 1 నుంచి కొత్త వేతనాలను అమలు చేయాలని కోరుతోంది.దీంతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రస్తుతం నెలకు కేటాయిస్తున్న రూ. 1,000 కోట్లను రూ. 2,000 కోట్లకు పెంచాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల విలువ రూ. 10 వేల కోట్లకు పైగా ఉందని జేఏసీ నేతలు చెబుతున్నారు.నవంబర్ 6న హైదరాబాద్‌లోని టీజీవో భవన్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. దీపావళి తర్వాత ఆందోళన కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ఉద్యోగుల అసంతృప్తి కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా కీలకంగా మారుతోంది. మహబూబ్‌నగర్– రంగారెడ్డి–హైదరాబాద్, వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఓటర్లుగా ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో నాలుగు లక్షలకు పైగా ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది గ్రాడ్యుయేట్లుగా ఉన్నారని జేఏసీ నేతలు పేర్కొంటున్నారు. వీరిలో గణనీయమైన సంఖ్యలో ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారని చెబుతున్నారు.పీఆర్సీ అమలు సహా తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓటు వేయడమే కాకుండా.. వ్యక్తిగత స్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని కొందరు ఉద్యోగులు హెచ్చరిస్తున్నట్లు సమాచారంఅధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే పీఆర్సీ, పెండింగ్ డీఏలు, బిల్లుల చెల్లింపులు, పెన్షన్ విధానం వంటి అంశాలు ఇంకా చర్చల్లోనే ఉండటంతో ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, పీఆర్సీ నివేదిక అందిన తర్వాత తీసుకోవాల్సిన నిర్ణయాలు ప్రభుత్వానికి కీలకంగా మారాయి. ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపుతుందా? లేక ఉద్యోగుల ఆందోళన మరింత తీవ్రమవుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. ఉద్యోగుల అసంతృప్తిని ప్రభుత్వం ఎలా చల్లారుస్తుందన్నది రాబోయే రోజుల్లో చూడాలి..

తండ్రి ఆస్తిలో కొడుకుకు జన్మహక్కు ఉంటుందా?

సుప్రీంకోర్టు కీలక తీర్పు

– తండ్రికి పంపకాల్లో వచ్చిన ప్రత్యేక ఆస్తిలో కొడుకుకు జన్మహక్కు ఉండదన్న సుప్రీంకోర్టు

– తాత ఆస్తి వారసులకు సంక్రమించి వ్యక్తిగత ఆస్తిగా మారితే కుమారుడు అందులో వాటా కోరలేడని స్పష్టీకరణ

– హిందూ వారసత్వ చట్టం–1956 ప్రకారం తాత ఆస్తి ఆయన క్లాస్–1 వారసులకు సంక్రమించిందన్న ధర్మాసనం

– ఈ మేరకు సగం వాటా కోరిన కొడుకు అప్పీల్‌ను కొట్టివేసిన కోర్టు



తండ్రికి చెందిన ఆస్తిలో కొడుకు జన్మహక్కు కింద వాటా కోరలేడని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తాత నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తి పంపకాల తర్వాత తండ్రికి ప్రత్యేక ఆస్తిగా మారితే, అందులో కొడుకుకు పుట్టుకతోనే హక్కు ఏర్పడదని పేర్కొంది. ఈ మేరకు ఆస్తిలో సగం వాటా కోరుతూ దాఖలైన అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ కేసు 1997లో దాఖలైన ఆస్తి విభజన వ్యాజ్యానికి సంబంధించినది. 1,811 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆస్తి తొలుత తన తాతకు చెందిందని, వారసత్వంగా తనకు జన్మహక్కు వచ్చిందని ఓ మైనర్ బాలుడు కోర్టును ఆశ్రయించాడు. తల్లి ద్వారా ఈ పిటిషన్ దాఖలు చేయించి ఆస్తిలో సగం వాటా కోరాడు. అయితే, ఆ బాలుడు పుట్టకముందే తాత మరణించారని, వారసత్వ ప్రక్రియ ప్రారంభమైందని సుప్రీంకోర్టు గుర్తుచేసింది. తాత ఆస్తిపై 1993లోనే విభజన ప్రక్రియ ప్రారంభమైంది. 1994 జనవరి 6న బాలుడు జన్మించగా, అదే ఏడాది ఫిబ్రవరి 3న ఆస్తి విషయంలో ఒప్పందం కుదిరింది. హిందూ వారసత్వ చట్టం–1956 ప్రకారం తాత ఆస్తి ఆయన క్లాస్–1 వారసులకు సంక్రమించిందని ధర్మాసనం పేర్కొంది. ఆస్తి విభజన తర్వాత ఒక్కొక్కరికి వచ్చిన వాటాలు వారి ప్రత్యేక ఆస్తులుగా మారాయని వివరించింది. ఈ క్రమంలో బాలుడి తండ్రికి వచ్చిన వాటా కూడా ఆయన వ్యక్తిగత ఆస్తిగా మారిందని తెలిపింది. తండ్రి తన వాటాను విక్రయించినప్పటికీ ఆ అమ్మకపు పత్రాలను ఎవరూ సవాలు చేయలేదని కోర్టు గుర్తించింది. పంపకాల్లో తండ్రికి వచ్చిన ఆస్తిపై కుమారుడికి జన్మహక్కు ఉండదని, ఆ ఆస్తిలో అతడు ఉమ్మడి హక్కుదారుడిగా (కోపార్సెనర్) హక్కు పొందలేదని స్పష్టం చేసింది. దీంతో కింది కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంటూ అప్పీల్‌ను కొట్టివేసింది.

రసవత్తరంగా పంచాయతీ పోరు..

ఏకగ్రీవం చేస్తే ఎకరం పొలం.. రూ.50 లక్షల ఆఫర్!



పశ్చిమ గోదావరి జిల్లా: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల హడావిడి కొనసాగుతూనే ఉంది.. ఇప్పటికే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ముగిసిపోగా.. ఇక పంచాయతీ ఎన్నికలకు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ సన్నాహాలు చేస్తోంది.. అయితే, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఓ గ్రామంలో ఎన్నికల రాజకీయం ఆసక్తికరంగా మారింది. సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేస్తే గ్రామానికి భారీగా నిధులు, ఆస్తులు ఇస్తామంటూ అభ్యర్థులు ముందుకు వస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఒక అభ్యర్థి ఏకంగా రూ.50 లక్షలు ఇస్తానని ప్రకటించగా.. మరో అభ్యర్థి ఎకరం పొలం ఇస్తానని ఆఫర్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నరసాపురం మండలం తూర్పుతాళ్లు గ్రామ పంచాయతీ ఎన్నిక ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. సర్పంచ్ పదవి కోసం పలువురు అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతున్నారు. అయితే ఎన్నికలు జరిగితే లక్షల రూపాయలు ఖర్చవడమే కాకుండా, గ్రామంలో ఇప్పటివరకు కొనసాగుతున్న ఐక్యత దెబ్బతింటుందని గ్రామ పెద్దలు భావించారు. దీంతో ఎన్నికను ఏకగ్రీవం చేయాలనే ఆలోచనతో ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా ఇటీవల పార్టీలకు అతీతంగా గ్రామ పెద్దలు సమావేశమయ్యారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో చర్చలు జరిపారు. ఎన్నికల కోసం అనవసరంగా డబ్బు ఖర్చు చేయడం, గ్రామంలో వర్గ విభేదాలు పెంచుకోవడం కంటే అందరూ కలిసి ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకోవడం మంచిదని అభిప్రాయపడ్డారు. ఏకగ్రీవానికి సహకరించే అభ్యర్థులు గ్రామ అభివృద్ధికి ఎంతమేరకు సహకరిస్తారు? గ్రామంలోని ఆలయాలు, చర్చిలు, ఇతర ప్రార్థనా మందిరాలకు ఏమి చేస్తారు? అని పెద్దలు అభ్యర్థులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఒక అభ్యర్థి గ్రామానికి రూ.50 లక్షలు ఇస్తానని ముందుకు వచ్చినట్లు సమాచారం. మరో అభ్యర్థి ఏకంగా ఎకరం పొలం ఇస్తానని ప్రకటించినట్లు తెలుస్తోంది. దీంతో తూర్పుతాళ్లు పంచాయతీ ఎన్నికల వ్యవహారం మరింత ఆసక్తికరంగా మారింది. అభ్యర్థులు గ్రామానికి ఇచ్చే హామీలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. అయితే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకోవాలని గ్రామ పెద్దలు భావిస్తున్నారు. ఎవరైనా నామినేషన్ దాఖలు చేసినా వారితో మాట్లాడి ఉపసంహరించుకునేలా ప్రయత్నించాలని నిర్ణయించారు. ఏకాభిప్రాయం కుదరకపోతే ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని కూడా భావిస్తున్నారు. ఈసారి తూర్పుతాళ్లు పంచాయతీ సర్పంచ్ పదవి ఓసీ జనరల్‌కు కేటాయించారు. కూటమి పార్టీలకు మద్దతుగా ఉన్న ఈ గ్రామంలో ప్రస్తుతం ముగ్గురు అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతున్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగాలని, ప్రజల మధ్య ఐక్యత దెబ్బతినకూడదనే ఉద్దేశంతో పెద్దలు చేస్తున్న ఏకగ్రీవ ప్రయత్నం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి. నామినేషన్ల గడువు ముగిసిన తర్వాతే దీనిపై పూర్తి స్పష్టత రానుంది.

సీఎం చంద్రబాబు అభివృద్ధి ప్రచారంపై వైఎస్ జగన్ విమర్శలు



అమరావతి,: సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి ప్రచారంపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి చెబుతున్న అభివృద్ధి గణాంకాలకు, రాష్ట్రంలోని వాస్తవ ఆర్థిక పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేదని ఆయన తన ఎక్స్ వేదికగా ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందంటూ కూటమి ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తోందని జగన్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు విపరీతంగా పెరిగిపోయాయని జగన్ విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఆర్థిక కార్యకలాపాలు మందగించాయని, కేవలం అంకెల గారడీతో అభివృద్ధి జరుగుతున్నట్లు భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కేవలం ప్రచార ఆర్భాటాలతో వాస్తవాలను దాచలేరని జగన్ పేర్కొన్నారు.

టెక్ మహేంద్ర మాజీ ఉద్యోగి కాల్పులేత..



న్యూఢిల్లీ : టెక్ మహీంద్రా ఆసియా మాజీ హెడ్ పరమ్‌జీత్ ధన్‌కర్ ఫరీదాబాద్ లో తన పొరుగింటి వ్యక్తి జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే సీసీటీవీకి ఆ కాల్పుల ఘటన చిక్కింది. ఆ వీడియోను ఇప్పుడు పోలీసులు రిలీజ్ చేశారు. నిందితుడు మోనూ శర్మ, పరమ్‌జీత్ మధ్య పార్కింగ్ అంశంలో వాగ్వాదం జరిగినట్లు వీడియోలో ఉన్నది. పరమ్‌జీత్ మాట్లాడుతున్న సమయంలో.. గన్ తీసి మోనూ శర్మ ఫైరింగ్‌కు పాల్పడ్డాడు. పక్కనే ఉన్న పరమ్‌జీత్ కుమారుడు భయంతో పరుగులు తీశాడు. మోను తన లైసెన్స్‌డ్ తుపాకీతో 15 రౌండ్లు కాల్చగా, 9 తూటాలు పరమ్‌జీత్‌కు తగిలాయి. టీషర్ట్ ధరించిన మోనూ శర్మ తన ప్యాంటు జేబులో నుంచి గన్ తీసి అకస్మాత్తుగా ఫైరింగ్ చేశాడు. 5 సెకన్లలో మల్టిపుల్ రౌండ్లు కాల్చాడు. టెకీ మహేంద్ర మాజీ ఉద్యోగి పరుగులు తీస్తున్నా.. నిందితుడు శర్మ మాత్రం బుల్లెట్ల వర్షం కురిపించాడు. బిల్డింగ్ గేటు తీసి బాధితుడు తప్పించుకునే ప్రయత్నం చేసినా అతన్ని నిందితుడు వదిలిపెట్టలేదు. కుప్పకూలిన పరమ్‌జీత్ వద్దకు ఓ వృద్ధ మహిళ వచ్చి నిందితుడిని అడ్డుకునే ప్రయత్నం చేసింది. మళ్లీ గన్‌ను రీలోడ్ చేసిన మోనూశర్మ .. పరమ్‌జీత్‌పై కాల్పులు జరిపాడు. ఫైరింగ్ చేస్తున్న సమయంలో నిందితుడు హ్యాపీ దీపావళి, ముబారక్ అని అరిచాడు. అందర్నీ చంపేస్తా, అందర్నీ చంపాకే వెళ్లిపోతా అని గట్టిగా అరుస్తున్నట్లు వీడియోలో ఉన్నది. పరమ్‌జీత్ తన మేనల్లుడి వివాహానికి హాజరయ్యేందుకు సింగపూర్ నుంచి భారత్‌కు వచ్చారు. పరమ్‌జీత్ కుటుంబ సభ్యులకు, వారి పొరుగింట్లో ఉంటున్న మోను శర్మ కుటుంబ సభ్యులకు తరచూ గొడవలు జరిగేవి. గత శుక్రవారం రాత్రి కారు పార్కింగ్ విషయంలో పరమ్‌జీత్, మోను మధ్య ఘర్షణ జరిగింది. మోను తన లైసెన్స్‌డ్ తుపాకీతో 15 రౌండ్లు కాల్చగా, 9 తూటాలు పరమ్‌జీత్‌కు తగిలాయి. దీంతో ఆయన ప్రాణాలు విడిచారు. కార్ల పార్కింగ్, పెంపుడు కుక్క మూత్ర విసర్జన వంటి సాధారణ విషయాల్లో గొడవ పడేవారని తెలుస్తున్నది. రెండు రోజులకే మోనును అరెస్ట్ చేశారు. మోను భార్య, కుమార్తె, కుమారుడు, సోదరుడు నిందితులని ఫిర్యాదులో పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఓటములపై లోకేశ్ సమీక్ష..

4 అంశాలపై నివేదికలకు ఆదేశం!

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఓటములపై నారా లోకేశ్ దృష్టి
- నాలుగు అంశాల ఆధారంగా కారణాలను తెలియజేయాలని పార్టీ నేతలకు సూచన
- క్యాడర్ అభిప్రాయాలకు విరుద్ధంగా అభ్యర్థుల ఎంపికతో ఓడిన స్థానాలేంటో గుర్తించాలన్న మంత్రి
- ఎమ్మెల్యేల పనితీరు, కూటమి సమన్వయ లోపం, వైసీపీ సంస్థాగత బలంపైనా నివేదిక కోరిన లోకేశ్
- 76 జడ్పీటీసీ, 1,700 ఎంపీటీసీ స్థానాల్లో ఓటమికి కారణాలను విశ్లేషించాలని సూచన



అమరావతి, : ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించినప్పటికీ.. కొన్ని చోట్ల ఎదురైన పరాజయాలపై మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దృష్టి సారించారు. ఓటమికి దారితీసిన కారణాలను గుర్తించి, భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా పార్టీ నేతల నుంచి నాలుగు అంశాలపై నివేదికలు కోరినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి మంచి ఫలితాలు సాధించింది. అయితే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి వైసీపీ నుంచి పలు చోట్ల గట్టి పోటీ ఎదురైంది. ఫలితంగా 76 జడ్పీటీసీ స్థానాలతో పాటు 1,700 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి ఓటమి చవిచూసింది. ఈ పరాజయాలకు కారణాలేంటన్నది తెలుసుకునేందుకు లోకేశ్ సమీక్షకు సిద్ధమయ్యారు. ఓటమికి దారితీసిన అంశాలను నాలుగు కేటగిరీలు గా విభజించి వివరాలు సేకరించాలని పార్టీ నేతలను కోరారు. తొలుత క్యాడర్ అభిప్రాయాలకు విరుద్ధంగా అభ్యర్థులను ఎంపిక చేయడం వల్ల ఓడిపోయిన స్థానాలను గుర్తించాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేక పరాజయం ఎదురైన స్థానాలు రెండో విభాగం కింద విభజించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపంతో ఓడిపోయిన స్థానాలు మూడో విభాగంగా గుర్తించాలన్నారు. వైసీపీకి సంస్థాగతంగా బలం ఉండటం వల్ల ఓటమి ఎదురైన స్థానాలు నాలుగో విభాగంగా నమోదు చేయాలని సూచించారు. పరిషత్ ఎన్నికల్లో కూటమి ఓటమికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి. కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో లోపాలు ఒక కారణమని తెలుస్తోంది. గెలిచే అవకాశమున్న పార్టీకి కాకుండా, కోటా ప్రాతిపదికన బలహీనమైన పార్టీకి కొన్ని స్థానాలు కేటాయించడం, బలహీన అభ్యర్థులను బరిలోకి దించడం వంటివి ప్రభావం చూపినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు వైసీపీ నుంచి ఇంతటి పోటీ ఎదురవుతుందని కూటమి అంచనా వేయలేకపోయిందని, ఆ పార్టీ క్షేత్రస్థాయి బలం కూడా కొన్ని చోట్ల ఫలితాలను ప్రభావితం చేసిందని విశ్లేషణలు పేర్కొంటున్నాయి. నాలుగు అంశాలపై నివేదికలు అందిన తర్వాత లోకేశ్ వాటిని పరిశీలించి, లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

దేశీయ బ్యాంకులకు భారీ లాభాలు..

మూడు నెలల్లో రూ.1.16 లక్షల కోట్లు

- 2026-27 రెండో త్రైమాసికంలో బ్యాంకుల నికర లాభంలో 20 శాతం పెరుగుదల
- రుణాల మంజూరు 19 శాతం పెరగడం, వడ్డీ ఆదాయం మెరుగుపడటం ఇందుకు కారణం
- బ్యాంకుల ఆర్థిక భద్రతను సూచించే కామన్ ఈక్విటీ టైర్-1 నిష్పత్తిలోనూ మెరుగుదల
- రెండో అర్ధభాగంలో బ్యాంకుల లాభాల వృద్ధి కొంత తగ్గవచ్చని కేర్‌ఎడ్జ్ అంచనా..



ఢిల్లీ,:దేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల లాభాలు భారీగా పెరిగాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (జులై-సెప్టెంబర్) బ్యాంకుల నికర లాభం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 20 శాతం వృద్ధి చెంది రూ.1.16 లక్షల కోట్లకు చేరింది. రుణాల మంజూరు పెరగడం, వాటిపై వచ్చే వడ్డీ ఆదాయం అధికం కావడం ఇందుకు ప్రధాన కారణాలని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. బ్యాంకులు ఇచ్చిన రుణాలు దాదాపు 19 శాతం పెరిగాయి. దీంతో రుణాలపై వచ్చే వడ్డీ ఆదాయం మెరుగుపడింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో బ్యాంకుల లాభాల వృద్ధి కేవలం 4.2 శాతానికే పరిమితం కావడం కూడా ఈసారి పెరుగుదలకు దోహదపడింది. అయితే బాండ్లపై వడ్డీ రేట్లు పెరగడంతో వాటి ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గిందని నివేదిక తెలిపింది. బ్యాంకుల ఆస్తులపై రాబడి (ఆర్ఓఏ) 0.07 శాతం పాయింట్లు పెరిగి 1.39 శాతానికి చేరింది. 2024-25 రెండో త్రైమాసికం తర్వాత ఇదే అత్యధికం. అయితే ఒకేసారి వచ్చిన ప్రత్యేక ఆదాయాలను పక్కనపెడితే ఈ రాబడిలో పెద్దగా మార్పు లేదు. ఈక్విటీపై మధ్యస్థ రాబడి (ఆర్ఓఈ) 0.79 శాతం పాయింట్లు పెరిగి 13.6 శాతానికి చేరింది. కేటాయింపులు తగ్గడంతో కొన్ని ప్రైవేటు బ్యాంకుల లాభాలు ఎక్కువగా పెరిగాయి. బ్యాంకుల ఆర్థిక భద్రతను సూచించే కామన్ ఈక్విటీ టైర్-1 (సీఈటీ-1) నిష్పత్తి కూడా ఏడాది క్రితంతో పోలిస్తే 0.87 శాతం పాయింట్లు పెరిగి 15.8 శాతానికి చేరింది. అన్ని బ్యాంకులూ ఆర్బీఐ నిర్దేశించిన కనీస ప్రమాణం కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని నివేదిక పేర్కొంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో అర్ధభాగంలో బ్యాంకుల లాభాల వృద్ధి కొంత తగ్గవచ్చని కేర్‌ఎడ్జ్ అంచనా వేసింది. ఒకేసారి వచ్చిన ప్రత్యేక ఆదాయాలు తగ్గడం, బాండ్ల ద్వారా ఆదాయం బలహీనంగా ఉండటం, రుణాల నష్టాలను ముందుగానే అంచనా వేసి నిధులు కేటాయించాల్సి రావడం ఇందుకు కారణాలుగా పేర్కొంది. కొత్తగా అమల్లోకి రానున్న ఎక్స్‌పెక్టెడ్ క్రెడిట్ లాస్ (ఈసీఎల్) విధానానికి సిద్ధమవుతూ బ్యాంకులు అదనపు కేటాయింపులు చేయాల్సి రావచ్చని తెలిపింది.

ఓర్వకల్లు ప్రజలకు గుడ్ న్యూస్.. డ్రోన్ సిటీ

అమరావతి, : రాష్ట్రంలో భద్రతా వ్యవస్థలను ఆధునికీకరించే దిశగా ప్రభుత్వం 'సెక్యూరిటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ శాండ్‌బాక్స్'ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర హోంమంత్రి అనిత ప్రకటించారు. సీఐఐ సదస్సులో ఆమె మాట్లాడుతూ డ్రోన్లు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలను పరీక్షించుకోవడానికి స్టార్టప్‌లు, ప్రముఖ పరిశ్రమలకు ఇది ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ రంగంలో పెట్టుబడులను, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు సింగిల్ విండో విధానం ద్వారా కేవలం 3 నుండి 7 రోజుల్లోనే అవసరమైన అనుమతులను మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా డ్రోన్ రంగానికి మరింత ఊతమిచ్చేలా కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ప్రత్యేకంగా 'డ్రోన్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు.

ప్రమాదాల భయంతో వాహనదారుల ఆందోళన...

ఎన్నికల సమయంలో తరలించిన భారీ బారిగేట్లు ఏమయ్యాయి
తిరిగి ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యమెందుకు
బారిగేట్లు లేకపోవడంతో యథేచ్ఛగా వాహనాల రాకపోకలు



తూర్పు గోదావరి జిల్లా:మండపేట పట్టణంలోని బైపాస్ రోడ్డు ప్రస్తుతం వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన భారీ బారిగేట్లు ఇప్పుడు కనిపించకుండా పోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో బైపాస్ రోడ్డుపై ఏర్పాటు చేసిన భారీ గేట్లను అధికారులు లేదా సంబంధిత సిబ్బంది తొలగించి ఇతర ప్రాంతాలకు తరలించినప్పటికీ, ఎన్నికల ప్రక్రియ ముగిసి రోజులు గడుస్తున్నా వాటిని తిరిగి పాత స్థానంలో ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది గతంలో ఈ ప్రాంతంలో భారీ వాహనాల రాకపోకలనునియంత్రించేందుకు ఏర్పాటు చేసిన బారిగేట్లు ప్రస్తుతం లేకపోవడంతో వాహనాలు ఎలాంటి నియంత్రణ లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా వేగంగా వచ్చే వాహనాలు, భారీ వాహనాల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.బైపాస్ రోడ్డు మీదుగా ప్రతిరోజూ అనేక వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ నేపథ్యంలో రహదారిపై అవసరమైన భద్రతా ఏర్పాట్లు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఎన్నికల అవసరాల కోసం తరలించిన బారిగేట్లను తిరిగి ఏర్పాటు చేయడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది.ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. భారీ బారిగేట్లు లేకపోవడం వల్ల రహదారిపై వాహనాల వేగ నియంత్రణ, రాకపోకల క్రమబద్ధీకరణ ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు.ఎన్నికల సమయంలో ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన ఏర్పాట్లను ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా కొనసాగించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.అధికారులు ఇప్పటికైనా స్పందించి మండపేట బైపాస్ రోడ్డులో గతంలో ఉన్న భారీ బారిగేట్లను వెంటనే తిరిగి ఏర్పాటు చేయాలని, అవసరమైన హెచ్చరిక బోర్డులు, రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే చర్యలు తీసుకుని ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



విశాఖలో ఘనంగా ప్రారంభమైన..

31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్

- ఏపీ, ఎంఎస్ఎంఈ పెవిలియన్లను ప్రారంభించిన పీయూష్ గోయల్, చంద్రబాబు, పవన్
- తిరుపతి, విశాఖ, అమరావతి ఎకనమిక్ రీజియన్ల ప్రగతిపై అధికారుల ప్రజెంటేషన్
- డోలు వాయించిన చంద్రబాబు, పీయూష్ గోయల్, పవన్ కల్యాణ్..

విశాఖపట్నం: విశాఖపట్నం వేదికగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సులో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ పెవిలియన్, ఎంఎస్ఎంఈ పెవిలియన్‌లను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం ప్రాంగణంలోని వివిధ స్టాళ్లను నేతలు ఆసక్తిగా పరిశీలించారు. సదస్సు వేదిక వద్ద ప్రముఖులకు ధింసా, తప్పెటగుళ్ళు వంటి రాష్ట్ర సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా చంద్రబాబు, పీయూష్ గోయల్, పవన్ కళ్యాణ్ స్వయంగా డోలు వాయించి కళాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం పెవిలియన్‌లో తిరుపతి, విశాఖపట్నం, అమరావతి ఎకనమిక్ రీజియన్లతో పాటు సీఆర్‌డీఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు ఇచ్చిన డిజిటల్ ప్రజెంటేషన్‌ను కేంద్ర మంత్రికి వివరించారు. ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమరావతి టవర్ మోడల్ అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించే తోలుబొమ్మలాట, పెన్ కలంకారీ, గిరిజన కళాకృతుల స్టాళ్లను నేతలు సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారుల ప్రతిభను కేంద్రమంత్రికి సీఎం వివరించారు. అనంతరం అరకు కాఫీ స్టాల్ వద్ద నేతలు కాఫీని రుచి చూశారు. సదస్సు ప్రాంగణంలో నేతలు కాసేపు బ్యాటరీ కారులో ప్రయాణించి పరిశ్రమల పురోగతిని సమీక్షించారు. నవంబర్ 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.







ఏపీని మీ కార్పొరేట్ హోంగా మార్చుకోండి..

- పెట్టుబడిదారుల రక్షణకు త్వరలో 'ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకొస్తామని ప్రకటన
- ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలకు ఎస్క్రో ఖాతాల ద్వారా చెల్లింపులు జరుపుతామని హామీ
- భారీ పెట్టుబడులతో ఏపీ పారిశ్రామిక రంగ స్వరూపం మారిపోయిందని వెల్లడి
- ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే తాను, సీఎం అందుబాటులో ఉంటామని భరోసా
- రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపు



విశాఖపట్నం: "గ్లోబల్ పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్‌ను కేవలం సందర్శించడం కాదు, ఇక్కడ పెట్టుబడులు పెట్టండి, ఆవిష్కరించండి, ఎదగండి. మీ ఫ్యాక్టరీలు మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్‌ను మీ కార్పొరేట్ హోమ్‌గా మార్చుకోండి" అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో అట్టహాసంగా ప్రారంభమైన సీఐఐ 31వ పార్టనర్‌షిప్ సదస్సులో ఆయన కీలక ప్రసంగం చేశారు. తమ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు పూర్తి అండగా ఉంటుందని, ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే అందుబాటులో ఉండి, వారి సొంత టీమ్‌ల కంటే వేగంగా స్పందిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

కొత్త చట్టం.. పక్కాగా ప్రోత్సాహకాలు : ఈ సదస్సులో చర్చిస్తున్న ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్ (వ్యాపారం, సాంకేతికత, నమ్మకం) అనే మూడు అంశాలకు తమ ప్రభుత్వంలో వాస్తవ రూపం కల్పిస్తామని లోకేశ్ తెలిపారు. వ్యాపార నిర్వహణలో స్పీడ్ (వేగం), పాలసీల్లో స్టెబిలిటీ (స్థిరత్వం), సర్వీస్ (సేవ) తమ విధానమని స్పష్టం చేశారు. పెట్టుబడిదారుల్లో మరింత విశ్వాసం నింపేందుకు త్వరలోనే 'ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకురాబోతున్నామని ఆయన కీలక ప్రకటన చేశారు. అలాగే, ప్రభుత్వం వాగ్దానం చేసిన ప్రోత్సాహకాలను నేరుగా పారిశ్రామికవేత్తలకే అందేలా, వారు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా 'ఎస్క్రో ఖాతాల' ద్వారా చెల్లింపులు జరిపే విధానాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

ఏపీ బలం.. మారిన పారిశ్రామిక స్వరూపం : ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న వెయ్యి కిలోమీటర్ల తీరప్రాంతం, విశాఖ ప్రధాన పోర్టు, నిర్మాణంలో ఉన్న నాలుగు కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, ఇటీవల ప్రారంభమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాలు రాష్ట్ర బలాన్ని చాటుతున్నాయని లోకేశ్ వివరించారు. కియా మోటార్స్, కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి సంస్థల రాకతో పారిశ్రామిక రంగం పుంజుకుందన్నారు.

2024 జూన్ నుంచి తమ ప్రభుత్వానికి రూ. 22.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి హామీలు వచ్చాయని, ఇందులో రూ. 17.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు కాగా, రూ. 5.9 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టుల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు. విశాఖలో గూగుల్ ఏర్పాటు చేస్తున్న 15 బిలియన్ డాలర్ల ఏఐ హబ్, డేటా సెంటర్‌ను దేశ చరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐగా ఆయన అభివర్ణించారు.

మూడు సక్సెస్ స్టోరీలు.. ప్రభుత్వ సహకారం : తమ ప్రభుత్వం పరిశ్రమలకు ఎలా అండగా నిలుస్తుందో చెప్పడానికి లోకేశ్ మూడు కంపెనీల సక్సెస్ స్టోరీలను ఉదహరించారు. టెక్స్‌టైల్ రంగం నుంచి ఏరోస్పేస్, డిఫెన్స్‌లోకి మారిన రేమండ్స్ (ఫ్లిప్), ప్రభుత్వ సహకారంతో అతిపెద్ద సోలార్ సెల్ తయారీదారుగా ఎదిగిన ప్రీమియర్ ఎనర్జీస్ (స్కేల్), మచిలీపట్నానికి చెందిన చిన్న కంపెనీ ఎస్ఎస్‌డీ పాలిమర్స్‌ను క్వాంటం వ్యాలీలో భాగస్వామిని చేయడం (ఇంక్యుబేషన్) ద్వారా తమ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు.

ప్రధాన కార్యాలయాలను ఏపీకి తరలించండి : పరిశ్రమల స్థాపనకే పరిమితం కాకుండా, తమ ప్రధాన కార్యాలయాలను కూడా ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని లోకేశ్ పారిశ్రామికవేత్తలను కోరారు. ఇక్కడి స్వచ్ఛమైన గాలి, ట్రాఫిక్ లేని ప్రశాంత జీవన విధానం, నైపుణ్యం కలిగిన యువత, ప్రపంచ స్థాయి కనెక్టివిటీ, గూగుల్ ఏఐ హబ్, అమరావతి క్వాంటం వ్యాలీ వంటి భవిష్యత్ ప్రాజెక్టులు ఇందుకు దోహదం చేస్తాయన్నారు. తాను, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఒక వాట్సాప్ సందేశం దూరంలోనే అందుబాటులో ఉంటామని, సమావేశాల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. జ్ఞాపకాలతో పాటు, ఏపీ నుంచి భవిష్యత్తును నిర్మించుకునే ప్రణాళికతో తిరిగి వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.

కోతులు, వీధి కుక్కల బెడదతో ప్రజల భయాందోళన

స్కూల్ కి వెళ్లాలంటే భయపడుతున్న పిల్లలు, వృద్ధులు..



మహబూబాబాద్ : గార్ల స్థానికమేజర్ గ్రామపంచాయతీ లో కోతులు, వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని పలు వీధుల్లో కోతుల గుంపులు, వీధి కుక్కలు స్వేచ్ఛగా సంచరిస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే యపడుతున్నారు. కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో పాటు, వీధుల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ రాకపోకలు సాగించే ప్రజలను వెంటపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు పాఠశాలలకు వెళ్లే సమయంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంటోందని, వృద్ధులు సైతం అవసరమైన పనుల కోసం బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. మార్కెట్ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. ప్రజల భద్రత దృష్ట్యా పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కోతులను నియంత్రించడంతో పాటు వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న బోరుకు పునర్జీవం!

డోర్నకల్ బైపాస్ రోడ్డులో బోరుకు మరమ్మతులు..
తిరిగి అందుబాటులోకి నీటి వసతి



కారేపల్లి, : ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ పాలకవర్గం ముందస్తు చర్యలు చేపట్టింది. డోర్నకల్ బైపాస్ రోడ్డులోని రైస్ మిల్లు సమీపంలో గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న బోరును గుర్తించి మరమ్మతులు చేయించడంతో తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో స్థానికులకు నీటి వసతి అందుబాటులోకి వచ్చింది.అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ, నిరుపయోగంగా ఉన్న బోర్లను పునరుద్ధరించడం ద్వారా ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా చూడాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టారు. నీటి సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అందుబాటులో ఉన్న వనరులను సిద్ధం చేసుకోవడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడవచ్చని గ్రామపంచాయతీ పాలకవర్గం పేర్కొంది. ఏళ్ల తరబడి ఉపయోగంలో లేకుండా ఉన్న బోరును తిరిగి అందుబాటులోకి తీసుకురావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేదరి టోనీ,ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యుడు ఆదర్ల అంజయ్య, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి బీఆర్ఎస్ నాయకుల మద్దతు

ఉసిరికాయలపల్లి సీనియర్ నాయకుడు ధారావత్ రాంబాబు మర్యాదపూర్వక భేటీ.. సింగరేణి మండలంలో పార్టీ విజయానికి కృషి చేస్తామని వెల్లడి

కారేపల్లి, నవంబర్ 12 : రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి విజయానికి కృషి చేస్తామని ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ధారావత్ రాంబాబు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల ప్రచారం, సింగరేణి మండలంలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా ధారావత్ రాంబాబు మాట్లాడుతూ సింగరేణి మండలంలో యువత, మేధావులు, పట్టభద్రుల నుంచి బీఆర్ఎస్ పార్టీకి సానుకూల స్పందన లభిస్తోందని తెలిపారు. మండలంలోని గ్రామాల్లో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేస్తున్నాయని, పట్టభద్రులను కలిసి పార్టీ విధానాలను వివరిస్తూ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సీనియర్ నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో కీలకమని అన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా నడుం బిగించి పట్టభద్రులను చైతన్యపరుస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.

అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం..

సేవాభావంతో సర్పంచ్ కిరణ్ కుమార్!
సొంత ఖర్చులతో అన్నప్రసాద వితరణకు శ్రీకారం..
గంగారం తండాలో భక్తులకు ఆధ్యాత్మిక సేవ



కారేపల్లి, : భక్తి భావంతో పాటు సేవా దృక్పథాన్ని చాటుకుంటూ సింగరేణి మండలం గంగారం తండా గ్రామ సర్పంచ్ సునావత్ కిరణ్ కుమార్ ప్రత్యేక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయ్యప్ప మాలధారణ చేసి మండల దీక్షలో ఉన్న స్వాములకు తన సొంత ఖర్చులతో ప్రతిరోజూ అన్నదానం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప స్వాముల దీక్షా కాలంలో భక్తులకు అన్నప్రసాదం అందించాలనే సంకల్పంతో ఈ నిత్య అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తి మార్గంలో అన్నదానం అత్యంత పవిత్రమైన సేవగా భావిస్తూ, స్వాములకు ఆహారం అందించడం ద్వారా ఆధ్యాత్మిక సేవలో తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. స్వాములకు అన్నప్రసాదం అందించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదవిని ప్రజాసేవకే కాకుండా ఆధ్యాత్మిక సేవకు కూడా వేదికగా మలుచుకుంటూ సర్పంచ్ కిరణ్ కుమార్ చేస్తున్న ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు, అయ్యప్ప భక్తులు అభినందిస్తున్నారు. అన్నదానం మహాదానం అనే మాటకు నిదర్శనంగా సాగుతున్న ఈ సేవా కార్యక్రమం గంగారం తండాలో భక్తి భావాన్ని, సేవా స్ఫూర్తిని చాటుతోంది.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన రామవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

- రాష్ట్రస్థాయి షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం
- జాతీయస్థాయి పోటీలకు హర్షిక ఎంపిక



కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రతిభకు కొదవలేదని నిరూపిస్తూ రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని జె.హర్షిక అథ్లెటిక్స్‌లో సత్తా చాటింది. గురువారం హనుమకొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థిని విజయంపై ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినిని, పీఈటీ ధర్మమ్మను పాఠశాలలో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించి ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం భరత్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకుని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన హర్షిక జాతీయ స్థాయిలోనూ పతకం సాధించి మరిన్ని విజయాలు అందుకోవాలని రామవరం గ్రామస్థులు, విద్యాభిమానులు ఆకాంక్షించారు.